రిపోర్టర్లు కావలెను
తొలి సమయం
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న 'తొలి సమయం' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9000689544, 7569944360 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
సంపుటి : 02 సంచిక : 304 శనివారం 22-11-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-




## నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ సర్కార్ చేయదు : కేటీఆర్

- ఫార్ములా-ఈ కార్ కేసుపై స్పందించిన కేటీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం


హైదరాబాద్ : ఫార్ములా-ఈ కార్ కేసులో గవర్నర్ అనుమతిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఫార్ములా-ఈ కార్ కేసుపై ఇప్పటికే 100 సార్లు చెప్పాను ఏ తప్పు చేయలేదు, లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమేనని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఫార్ములా-ఈ కార్ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసునని చెప్పారు. నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరని, అందుకే దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారన్నారు. దానంతో రాజీనామా చేయిస్తామని మా వాళ్లతో అన్నారని తెలిపారు. అనర్హత వేటు పడితే పరువు పోతోందని రాజీనామాకు అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. సాంకేతికత సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారని చెప్పారు. “చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఫార్ములా-ఈ కార్ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారు. దానంతో రాజీనామా చేయిస్తామని మా వాళ్లతో అన్నారు. అనర్హత వేటు పడితే పరువు పోతోందని

మిగతా 2లో

# హైదరాబాద్ అడ్డాగా ఉగ్రకుట్రకు ప్లాన్

ఐసిస్ ఉగ్రవాదుల భారీ ‘ఉగ్ర’ కుట్ర బట్టబయలైంది. హరిద్వార్(ఉత్తరాఖండ్), దిల్లీ, లఖ్‌నవూ(యూపీ), అహ్మదాబాద్ (గుజరాత్), ముంబయి, కోల్‌కతా సహా ప్రధాన నగరాల్లో ప్రాణాంతక రసాయనాలతో ఉగ్రదాడులకు పథక రచన జరిగిందని గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) గుర్తించింది. ఐసిస్‌తో లింకులున్న అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్, ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ సలీం ఖాన్‌లను కొన్ని రోజుల క్రితం అహ్మదాబాద్‌లో అరెస్టు చేసి ఇంటరాగేట్ చేయగా ఈ వివరాలు వెలుగుచూశాయి. వీరిలో ప్రధాన నిందితుడు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ తెలంగాణలోని హైదరాబాద్ వాస్తవ్యుడే. ఉగ్రదాడులకు పథక రచన చేయడంలో ఇతడిది కీలక పాత్ర అని గుజరాత్ ఏటీఎస్ అనుమానిస్తోంది. అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ ఒక డాక్టర్. అతడు చైనాలో ఎంబీబీఎస్ చేశాడు.

- హైదరాబాదీ వైద్యుడే ప్రధాన సూత్రధారి
- ఉగ్రదాడులకు హైదరాబాదీ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ పథక రచన
- యూపీకి చెందిన ఆజాద్ సులేమాన్, మహ్మద్ సుహైల్‌లతో కలిసి ప్లాన్
- ఆయుధాలను తరలిస్తుండగా అహ్మదాబాద్‌లో ముగ్గురి అరెస్ట్- ఐసిస్, ఐఎస్‌కేపీ ఉగ్రవాద సంస్థలతో లింకులు
- అహ్మదాబాద్‌లో మూడు కీలక అరెస్టులు
- పాక్ నుంచి రాజస్థాన్‌కు డ్రోన్‌లో ఆయుధాలు





హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో ఉన్న ఫోర్ట్‌వ్యూ కాలనీలోని అసద్ మన్‌జిల్‌లో నివసిస్తున్నాడు. ఎంబీబీఎస్ చేసినా అహ్మద్ ఇంట్లోనే ఒంటరిగా ఉండేవాడని గుర్తించారు. అతడి ప్రవర్తన వింతగా ఉండేదని దర్యాప్తులో తేలింది. అహ్మద్ వివిధ కెమికల్స్ కోసం ఆన్‌లైన్‌లో పదేపదే ఆర్డర్లు ఇచ్చాడని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు తేల్చారు. తన ఇంటిలోని ఓ గదిలో రసాయనాలు, ఆముదం నూనె (రైజిన్)తో రహస్య ప్రయోగాలు చేస్తుండేవాడని నిర్ధరించారు. దీంతో అనుమానం వచ్చి కుటుంబీకులు పలుమార్లు ప్రశ్నించగా, కమర్షియల్ అవసరాలకు వినియోగించే ఒక కెమికల్‌ను తయారు చేస్తున్నానని అహ్మద్ బదులిచ్చాడు. ఎన్‌క్రిప్టెడ్ యాప్స్, సోషల్ మీడియా

మిగతా 2లో



## నెహ్రూ రచనలు దేశానికి దిక్సూచి లాంటివి

- రాహుల్ గాంధీ

- నెహ్రూ రచనలను డిజిటల్‌గా మార్చడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం

ఢిల్లీ : భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ రచనలను డిజిటల్‌గా మార్చడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. నెహ్రూ రచనలు దేశానికి శక్తిమంతమైన దిక్సూచి లాంటివని అభిప్రాయపడ్డారు. భారత దేశ ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాని తెలిపారు. నెహ్రూ రచనలు కేవలం చారిత్రక రికార్డులు మాత్రమే కాదని, దేశం ధైర్యం, సందేహాలు, ఆకాంక్షలను సంగ్రహించే మనస్సాక్షిని ప్రతిబింబిస్తాయని వెల్లడించారు. ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో ఆయనకు ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాల గురించి లోతైన విశ్లేషణను అందిస్తాయని పేర్కొన్నారు. “నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదు. అవి భారతదేశం పరిణతి చెందుతున్న మనస్సాక్షికి నిదర్శనం. ముఖ్యంగా మన దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునేవారికి దాని ధైర్యం, సందేహాలు, కలలు తెలుసుకునేందుకు నెహ్రూ మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోయాయి. ఈ వారసత్వం ఇప్పుడు బహిరంగంగా, అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంచినందుకు సంతోషం. భవిష్యత్తులో దీనిని ఇంకా విస్తరించాలని ఆశిస్తున్నాను.


– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

నెహ్రూ మేధో, రాజకీయ వారసత్వం ఇప్పుడు పరిమితులు

మిగతా 2లో

## రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- రాచకొండ క్రైమ్స్ డీసీపీగా గుణశేఖర్
- రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు
- 32 మందికి స్థానచలనం కల్పించిన సర్కార్




హైదరాబాద్ : రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. 32 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను అదనపు డీజీ పర్సనల్‌గా బదిలీ చేశారు. పరిమళ హనా నూతన్ జేకబ్‌ను సీఐడీ డీఐజీ, పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన మైలబత్తుల, మహేశ్వరం డీసీపీగా నారాయణ రెడ్డి, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా పద్మజ, నాగర్ కర్నూల్ ఎస్పీగా పాటిల్ సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ దక్షిణ మండలం డీసీపీగా కిరణ్

మిగతా 2లో

## దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం ‘తేజస్’- పైలట్ మృతి

- విమాన ప్రదర్శన సమయంలో కూలిన తేజస్ యుద్ధ విమానం- కూలిన వెంటనే మంటలు వ్యాపించి దగ్ధమైన విమానం



దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమాన ప్రదర్శన సమయంలో ఈ ఫైటర్ జెట్ ఎత్తు తగ్గుతూ కిందకు వస్తున్నట్టు అనిపించింది. అయితే వేగంగా వెళ్లి ఒక్కసారిగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థంలో భారీగా పొగలు అలుముకున్నాయి. తీవ్ర

మిగతా 2లో




## ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం: కవిత

- మహేశ్వరంలో సబిత అనుచరులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపణ
- కబ్జాలపై సబిత స్పందించకపోవడం దారుణమన్న కవిత
- హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసిందని వ్యాఖ్య

## ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త లేబర్ కోడ్‌లు...

- అమల్లోకి వచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడాదికే గ్రాట్యుటీ పొందే అవకాశం
- ఐటీ ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోపు జీతాలు తప్పనిసరి
- గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారిగా సామాజిక భద్రత కల్పన







## నితీశ్ కేబినెట్‌లో అవినీతి, క్రిమినల్స్‌కు చోటు- నా సంపాదనలో 90 శాతం పార్టీకే : ప్రశాంత్ కిశోర్

- జనవరి 15 నుంచి బిహార్ నవనిర్మాణ్ సంకల్ప్ యాత్రను చేపట్టనున్నట్లు ప్రకటన

## ఫుల్‌టైమ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే’- స్పష్టం చేసిన డీకే శివకుమార్

- ఐదేళ్లు ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యే - సీఎం మార్పుపై ప్రచారానికి తెరవేసిన డీకే శివకుమార్



# హైదరాబాద్ అడ్డాగా ఉగ్రకుట్రకు ప్లాన్

యాప్స్ ద్వారా అతివాద గ్రూపులు, ఐసిస్ ఉగ్రవాదులతో అతడు టచ్‌లో ఉండేవాడని గుర్తించారు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబయి నగరాలకు అహ్మద్ వెళ్లొచ్చాడు. ఉగ్రదాడుల కోసం అక్కడ రెక్కీ నిర్వహించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా నవంబరు మొదటి వారంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ వెళ్లాడు. నగరంలోని గ్రాండ్ యాంబియెన్స్ హోటల్‌కు చేరుకున్నాడు. దీనిపై వెంటనే నిఘా వర్గాల నుంచి గుజరాత్ ఏటీఎస్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అహ్మద్‌ను అరెస్టు చేశారు. నవంబరు 7న గాంధీనగర్ జిల్లాలోని కలోల్ పట్టణంలో ఉన్న ఓ శ్మశాన వాటిక వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అహ్మద్ ప్రయాణిస్తున్న సిల్వర్ ఫోర్డ్ ఫిగో కారులో ఒక బ్యాగు దొరికింది. అందులో 2 గ్లోక్ పిస్టల్స్, 1 బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, 4 లీటర్ల ఆముదం నూనె ఉన్నాయి. అహ్మద్‌కు ఈ ఆయుధాలను అందించిన ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీంలను అదే రోజున గుజరాత్‌లోని బనస్‌కాంత పట్టణంలో అరెస్టు చేశారు. ఆజాద్, మహ్మద్ సుహైల్‌లు ఉత్తరప్రదేశ్ వాస్తవ్యులు. అరెస్టయ్యే సమయానికి వీరిద్దరి వద్ద కూడా ఆయుధాలు, రసాయనాలు లభ్యమయ్యాయి.

గత ఏడాది కాలంగా ఈ ముగ్గురు నిందితుల కదలికలను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ట్రాక్ చేస్తుండటం గమనార్హం. నవంబరు 7న గ్రాండ్ యాంబియెన్స్ హోటల్‌లో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ తిరుగుతున్న వీడియో ఫుటేజీ పోలీసులకు దొరికింది. మరో నిందితుడు మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీం ఇంట్లో ఐసిస్ జెండా, డిజిటల్ ఎవిడెన్సులు లభించాయి.

ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ మహ్మద్ సలీంలను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు విచారించగా ముఖ్యమైన విషయాలు చెప్పారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌ఘర్ నుంచి ఈ ఆయుధాలను పొందామని నిందితులు వెల్లడించారు. పాకిస్థాన్ బార్డర్ మీదుగా ఒక డ్రోన్‌లో ఈ ఆయుధాలు హనుమాన్‌ఘర్‌కు చేరాయన్నారు. ఈ ఆయుధాల సప్లై కోసం పాకిస్థాన్‌లోని పలువురు హ్యాండ్లర్లతో హైదరాబాద్‌కు చెందిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ నిత్యం టచ్‌లో ఉండేవాడని దర్యాప్తులో వెల్లడైంది. ఆజాద్ సులేమాన్, మహ్మద్ సుహైల్, అహ్మద్ మొహియుద్దీన్‌లు ఈ ఆయుధాల కోసమే నవంబరు మొదటి వారంలో గుజరాత్‌కు వచ్చారని విచారణలో గుర్తించారు. ఆముదం నూనెతో ప్రాణాంతక రసాయన ఆయుధాల తయారీకి అహ్మద్ ప్రయోగాలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల విచారణలో అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ కీలక వివరాలు వెల్లడించాడు. ఇస్లామిక్ స్టేట్ ఖొరాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) అనే ఉగ్రవాద సంస్థతో తనకు లింకులు ఉన్నట్లు అతడు తెలిపాడు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండే అబూ ఖదీజా అనే ఐఎస్‌కేపీ ఉగ్రవాది పర్యవేక్షణలో అహ్మద్ ఉగ్రదాడులకు ప్లానింగ్ చేస్తున్నట్లు గుర్తించామని గుజరాత్ ఏటీఎస్ డీఎస్‌పీ ఎస్ఎల్ చౌదరి తెలిపారు. నిందితుల ఇళ్లు, వారితో సంబంధమున్న నివాసాల్లో తనిఖీల కోసం 4 వేర్వేరు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిందితుల ఫోన్లలోని ఫొటోలు, వీడియోలపై దర్యాప్తు చేసేందుకు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈ కేసు వివరాలను హైదరాబాద్ పోలీసులకు కూడా అందించామని గుజరాత్ ఏటీఎస్ డీఎస్‌పీ ఎస్ఎల్ చౌదరి చెప్పారు. అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్‌తో ఉగ్ర లింకులున్న వారిని గుర్తించడంపై ఫోకస్ పెట్టామన్నారు. ప్రస్తుతం అహ్మద్ కాల్ డీటెయిల్ రికార్డ్ (సీడీఆర్)లతో పాటు లోకల్ కాంటాక్ట్‌లను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆముదం నూనెతో రసాయన దాడులకు పథక రచన చేసిన వ్యవహారంపైనా అహ్మద్ నుంచి పూర్తి చిట్టాను సేకరిస్తామన్నారు. సోమవారం రోజు (నవంబరు 24న) హైదరాబాద్‌లోని అహ్మద్ మొహియుద్దీన్ సయ్యిద్ నివాసాలు, సంబంధీకుల ఇళ్లలో రైడ్స్ జరిగే అవకాశాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో ఉగ్ర కుట్ర వెలుగుచూసిన నేపథ్యంలో, తాజాగా వెలుగుచూసిన ఈ వ్యవహారం కలకలం రేపింది. ప్రస్తుతం విజయనగరం ఉగ్ర కుట్ర వ్యవహారాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారిస్తోంది. ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయనే అభియోగాలతో సికింద్రాబాద్‌లోని లాలాగూడకు చెందిన సమీర్‌ను అరెస్టు చేశారు.

ఈ ఏడాది జులై 23న 'అల్ ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్ కాంటినెంట్' (ఏక్యూఐఎస్) ఉగ్రవాద సంస్థతో లింకులున్న ఐదుగురిని గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. వీరిలో సమా పర్వీన్ అనే 30 ఏళ్ల యువతి ఉంది. ఆమె బెంగళూరు వాస్తవ్యురాలు. అరెస్టయిన ఇతర నిందితుల్లో మహ్మద్ ఫైఖ్ (ఢిల్లీ), మహ్మద్ ఫర్దీన్ (అహ్మదాబాద్), సైఫుల్లా ఖురేషీ (నోయిడా), జీషాన్ అలీ (నోయిడా) ఉన్నారు. అంతకుముందు అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు విచారణలో చెప్పిన సమాచారం ఆధారంగా, సమా పర్వీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం 'తేజస్'- పైలట్ మృతి

గాయాలతో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. పైలట్ మృతిని భారత వైమానిక దళం ధ్రువీకరించింది. భారత వాయుసేనలో వినియోగిస్తున్న తేలికపాటి యుద్ధ విమానం %ఎ.ూా.ా% తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటల 40 నిమిషాల సమయంలో ప్రదర్శన చేస్తూ కూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందారు. ఈ ఘటనపై భారత వైమానక దళం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పైలట్ కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. "దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పైలట్‌కు తీవ్ర గాయాలై మృతిచెందడం దిగ్భ్రాంతికరం. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ కష్ట సమయంలో పైలట్ కుటుంబానికి అండగా ఉంటాం. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతాం."

**– భారత వాయుసేన – ఆకాశాన్ని అలుముకున్న నల్లటి పొగ**

ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. యుద్ధ విమానం ఒక్కసారిగా కూలి మంటలు చెలరేగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెగెటివ్ జీ-ఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన అయిన దుబాయ్ ఎయిర్‌షోలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన విమానయాన సంస్థలు ఈ ఎయిర్‌షోలో పాల్గొని సందడి చేస్తాయి.

**భారీగా తేజస్ విమానాల కొనుగోళ్లకు ఆర్డర్లు**

తేజస్ యుద్ధ విమానం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌-లో తయారైంది. ఇది పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 4.5వ తరం ఫైటర్‌జెట్. భారత్ తయారు చేసిన తొలితరం యుద్ధ విమానం తేజస్ ఎంకే 1.

భారీగా తేజస్ విమానాల కొనుగోళ్లకు ఇప్పటికే వైమానిక దళం ఆర్డర్లు ఇచ్చింది. 350కి పైగా తేజస్ విమానాలను ఇండక్ట్ చేసుకునేందుకు సిద్ధమైంది. గత అక్టోబర్‌లో 2 విమానాలను వైమానికదళానికి %నూూా% అందించింది.

**తేజస్ ప్రమాదానికి గురవడం ఇది రెండోసారి**

కాగా, ఈ యుద్ధ విమానాలు ప్రమాదానికి గురవడం ఇది రెండోసారి. అంతకుముందు ఈ ఏడాది మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తేజస్ ఫైటర్ జెట్ శిక్షణ సార్టీలో ఉండగా కూలిపోయింది. ఆ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డారు.

# నీతీశ్ కేబినెట్‌లో అవినీతి, క్రిమినల్స్‌కు చోటు- నా సంపాదనలో 90-శాతం పార్టీకే : ప్రశాంత్ కిశోర్

బిహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గంపై జన్‌సూరజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ తీవ్ర ఆరోపణలు చేశారు. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గం పూర్తిగా అవినీతి, క్రిమినల్ నేతలతో నిండిపోయిందని విమర్శించారు. ఇలాంటి నేతలను మంత్రివర్గంలో చేర్చడం ద్వారా ప్రధాని మోదీ, అమిత్ షా, నీతీశ్ కుమార్‌కు బిహార్ ప్రజల గురించి ఆలోచించట్లేదనే విషయం అర్థమవుతుందన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి బిహార్ నవనిర్మాణ్ సంకల్ప్ యాత్రను చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ యాత్రలో భాగంగా తనతో పాటు జన్‌సూరజ్ పార్టీ కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ఇళ్లను సందర్శిస్తారని తెలిపారు. వెస్ట్ చంపారణ్ లోని గాంధీ ఆశ్రమంలో చేపట్టిన ఒక రోజు మౌనవ్రతం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

"గురువారం ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్ కొత్త మంత్రివర్గంలో మొత్తం అవినీతిపరులు, నేరస్థులే ఉన్నారు. ఈ కేబినెట్ నియామకం బిహార్ ప్రజలకు చెంపదెబ్బ లాంటిది. సుమారు కోటి మందికి పైగా మహిళల ఖాతాల్లో రూ.10వేలు వేసి ఓట్లను కొనుగోలు చేశారు. ఇప్పుడు బిహార్ ప్రజల గురించి ఆలోచించడం లేదు. ఈ నగదు బదిలీ పథకం కోసం ప్రపంచ బ్యాంక్ గ్రాంట్లతో పాటు రాష్ట్ర అత్యవసర నిధులను వాడుకున్నారు. నేను ఏదైనా తప్పుగా మాట్లాడితే రాష్ట్ర ప్రభుత్వం నన్ను జైలులో వేయవచ్చు. సుమారు 15-18 నెలల్లో రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు తిరిగి ప్రభుత్వం దొంగ హామీలను ప్రజలకు వివరిస్తాం. ప్రచారానికి ముందే జన్‌సూరజ్ పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకుంటాం. వచ్చే 20 నెలలు ప్రతి రోజు ఒక బ్లాక్‌లో గడుపుతాను. బ్లాక్‌లోని మహిళలకు ఫామ్‌లు నింపించి ప్రభుత్వ అధికారులను కలిసి అందిస్తాను. బ్లాక్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోరాడుతాం."

**– ప్రశాంత్ కిశోర్, జన్‌సూరజ్ పార్టీ అధినేత**

వచ్చే ఐదేళ్లపాటు తన ఆదాయంలో 90 శాతం సంపదను పార్టీ నిర్వహణకు దానం చేస్తానని తెలిపారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన సహనం, శాంతినే తాను కూడా నమ్ముతానని చెప్పారు. "నా ఆదాయంలో 90శాతం సంపదను పార్టీకి దానం చేస్తాను. ఇంకా దిల్లీలోని నా ఇల్లు మినహా గత 20 ఏళ్లలో నేను సంపాదించినదంతా పార్టీకే ఇస్తాను. ఇప్పుడు బిహార్ ప్రజలకు కూడా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. పార్టీతో సంబంధం ఉన్నవారందరూ రూ. వెయ్యి విరాళంగా ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీకి విరాళం ప్రకటించని వారితో చర్చించను. కనీసం కోటి మంది ఇచ్చినా 100కోట్ల నిధి అవుతుంది." అని ప్రశాంత్ కిశోర్ తెలిపారు.

అంతకుముందు బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోకుండా ఘోర పరాజయం పాలేది. దీంతో ఎన్నికల ఫలితాలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్న ఆయన, తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని చెప్పారు.

ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లకు గాను 202 సీట్లు దక్కించుకొని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. గురువారం పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

# ఫుల్‌టైమ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే'- స్పష్టం చేసిన డీకే శివకుమార్

కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌లో 'ముఖ్యమంత్రి' మార్పు ఉంటుందనే ప్రచారానికి ఎట్టకేలకు కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తెరదించారు. ఐదేళ్లూ సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయన స్పష్టం చేశారు. తామంతా అందుకు సహకరిస్తామని పేర్కొంటూ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు.

"మొత్తం 140 మంది శాసన సభ్యులు నా వాళ్లే. గ్రూప్‌లు కట్టడం అనేది నా రక్తంలో లేదు. ముఖ్యమంత్రి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరూ తాము మంత్రి కావాలని కోరుకుంటారు. అందుకే దిల్లీలోని హైకమాండ్‌తో వారు సమావేశం అయ్యారు. అది వారి హక్కు. ఇది సహజంగా జరిగేదే. అధిష్ఠానం వద్దకు వెళ్లవద్దని ఎవరినీ ఆపలేం కదా! ఐదేళ్లూ తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పారు. ఆయనతో మేము కలిసి పనిచేస్తాం. హైకమాండ్ ఆదేశాలకు మేము కట్టుబడి ఉంటాం."

**– డీకే శివకుమార్, కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే ఆశలు గల్లంతు!**

వాస్తవానికి డీకే శివకుమార్ శిబిరం చాలా కాలంగా నాయకత్వ మార్పు కోసం పార్టీ హైకమాండ్‌పై ఒత్తిడి పెంచుతూ వచ్చింది. మరోవైపు సిద్ధరామయ్య తానే సీఎంగా కొనసాగుతానని చెబుతూ వచ్చారు. దీనితో పార్టీలోనే అంతర్గతంగా రెండు వర్గాల మధ్య అధికార పోరాటం జరిగింది. ఇటీవల మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ కర్ణాటక చీఫ్ పదవిలో శాశ్వతంగా ఉండలేనని వ్యాఖ్యానించారు. అంతేకాదు తన ప్రసంగానికి సంబంధించిన విషయాలతో డీకే ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. దీనికి 'ఎక్కడ కృషి ఉంటుందో, అక్కడే ఫలితం ఉంటుంది. భక్తి ఎక్కడుంటే, భగవంతుడు అక్కడుంటాడు' అని రాశారు. కానీ చివరికి హైకమాండ్ ఆదేశాల మేరకు డీకే వెనక్కు తగ్గి, ఐదేళ్లూ సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని చెప్పి, ఈ తతంగానికి ఒక ముంగిపు ఇచ్చారు.

**ఇకపైనా నేనే సీఎం..** ఇంతకు ముందు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, భవిష్యత్‌లో రాష్ట్ర బడ్జెట్‌లను కూడా ప్రవేశపెడతానని పేర్కొన్నారు. డికే శివకుమార్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా చేయాలని పార్టీ నాయకత్వంపై ఒత్తిడి చేయడానికి కనీసం 15 మంది ఎమ్మెల్యేలు, డజను మంది ఎంఎల్‌సీలు దిల్లీలో మకాం వేసిన నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఒప్పందాన్ని తుంగలో తొక్కారు!**

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రి పీఠం గురించి ఓ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు (అంటే ఈ నవంబర్ 20 వరకు) సీఎంగా ఉండాలి. ఆ తరువాత శివకుమార్ సీఎం పీఠాన్ని అధిరోహించాలి. కానీ ఇది జరగలేదు. దీనితో కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయం వేడెక్కింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మద్దతుదారులు దిల్లీకి వెళ్లడంతో ముఖ్యమంత్రి మార్పుపై ప్రచారం జోరుగా సాగింది. కానీ హైకమాండ్ మాత్రం సిద్ధరామయ్య వైపే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచి తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య, ఎమ్మెల్యేల్లో అత్యధికులు తనకే మద్దతుగా ఉన్నారని చెబుతూ వచ్చారు. అంతేకాదు దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. క్యాబినెట్‌లో మార్పులు చేసి, అసంతృప్తులను బుజ్జగించవచ్చని సిద్ధరామయ్య చెప్పినట్లు తెలుస్తోంది. ఇందుకు హైకమాండ్ కూడా అంగీకరించినట్లు సమాచారం.

# ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త లేబర్ కోడ్‌లు...

ప్రతి ఉద్యోగికి అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడం ఇకపై తప్పనిసరి దేశంలోని కోట్లాది మంది ఉద్యోగుల సంక్షేమం, భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 పాత కార్మిక చట్టాలను ఏకీకృతం చేస్తూ రూపొందించిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను శుక్రవారం నుంచి అమలులోకి తీసుకొచ్చింది. వేజెస్ కోడ్, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ కోడ్ అనే ఈ నాలుగు సంస్కరణలు వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సమగ్రమైన రక్షణ కవచాన్ని అందించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు, సామాజిక భద్రత, మహిళల సాధికారత వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**కార్మిక చట్టాల్లో సమూల సంస్కరణలు**

సంక్లిష్టంగా, బహుళ నిబంధనలతో ఉన్న 29 వేర్వేరు చట్టాల స్థానంలో కేవలం 4 కోడ్‌లను తీసుకురావడం ద్వారా ప్రభుత్వం కార్మిక చట్టాల వ్యవస్థను సరళీకృతం చేసింది. దీనివల్ల ఉద్యోగులకు తమ హక్కులపై స్పష్టత లభించడంతో పాటు, యాజమాన్యాలకు కూడా నిబంధనల పాటింపు (కాంప్లయన్స్) సులభతరం అవుతుంది. ముఖ్యంగా, ఇప్పటివరకు చట్టపరమైన గుర్తింపు లేని గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లను (ఓలా, ఉబర్, స్విగ్గీ వంటి యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేసేవారు) తొలిసారిగా చట్ట పరిధిలోకి తీసుకురావడం ఈ సంస్కరణల్లో కీలకమైన మైలురాయి.

**ఉద్యోగులకు లభించే కీలక ప్రయోజనాలు**

కొత్త లేబర్ కోడ్‌లు ఉద్యోగులకు అనేక ప్రత్యక్ష ప్రయోజనాలను అందిస్తున్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

అపాయింట్‌మెంట్ లెటర్ తప్పనిసరి: ఇకపై ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా నియామక పత్రం (అపాయింట్‌మెంట్ లెటర్) ఇవ్వాలి. ఇందులో ఉద్యోగ నిబంధనలు, వేతనం, పని గంటలు వంటి వివరాలు స్పష్టంగా పేర్కొనాలి. ఇది ఉద్యోగ భద్రతకు, పారదర్శకతకు భరోసా ఇస్తుంది. సకాలంలో వేతనాలు: ఐటీ రంగంలోని ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోపు కచ్చితంగా జీతాలు చెల్లించాలి. ఇతర రంగాల్లోనూ వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి కఠిన నిబంధనలు చేర్చారు. పని గంటల నియంత్రణ: సాధారణంగా రోజుకు 8 నుంచి 12 గంటల పని, వారానికి 48 గంటలకు మించకుండా పనివేళలను నియంత్రించారు. అదనపు పని (ఓవర్‌టైమ్) చేయిస్తే రెట్టింపు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. ఉచిత ఆరోగ్య పరీక్షలు: 40 ఏళ్లు పైబడిన ఉద్యోగులకు యాజమాన్యాలు ఏటా ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించడం తప్పనిసరి.

**గ్రాట్యుటీ నిబంధనల్లో కీలక మార్పు**

గతంలో ఒక సంస్థలో కనీసం ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేస్తేనే ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు. అయితే కొత్త నిబంధనలు ఫిక్స్‌డ్-టర్మ్ ఎంప్లాయీస్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరటనిచ్చాయి. ఏడాదికే గ్రాట్యుటీ: ఇకపై ఫిక్స్‌డ్-టర్మ్ ఉద్యోగులు ఒక సంస్థలో కేవలం ఒక సంవత్సరం పనిచేసినా గ్రాట్యుటీ పొందేందుకు అర్హులవుతారు. దీనివల్ల తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సైతం పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు అందుతాయి.

గ్రాట్యుటీ లెక్కింపు: గ్రాట్యుటీని (చివరిగా తీసుకున్న వేతనం ఐ 15/26) ఐ పూర్తి చేసిన సేవా సంవత్సరాలు అనే ఫార్ములా ఆధారంగా లెక్కిస్తారు. ఒక ఉద్యోగి సేవలో ఉండగా మరణించినా లేదా వైకల్యానికి గురైనా కనీస సేవా కాలంతో సంబంధం లేకుండా గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంటుంది.

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు చట్టపరమైన గుర్తింపు దేశంలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కొత్త కోడ్‌లు చట్టపరమైన రక్షణ కల్పిస్తున్నాయి.

సామాజిక భద్రత: ఉబర్, స్విగ్గీ వంటి అగ్రిగేటర్ సంస్థలు తమ వార్షిక టర్నోవర్‌లో 1 నుంచి 2 శాతం వరకు సామాజిక భద్రతా నిధికి జమ చేయాలి. ఈ నిధిని గిగ్ వర్కర్ల పీఎఫ్, ఈఎస్ఐసీ, బీమా వంటి అవసరాలకు వినియోగిస్తారు.

పోర్టబుల్ ప్రయోజనాలు: ఆధార్‌తో అనుసంధానించిన యూనివర్సల్ అకౌంట్ నంబర్ ద్వారా వలస కార్మికులు రాష్ట్రాలు మారినా తమ సామాజిక భద్రతా ప్రయోజనాలను కోల్పోకుండా కొనసాగించుకోవచ్చు. మహిళా ఉద్యోగులకు అదనపు భరోసా మహిళా సాధికారతకు, సమానత్వానికి కొత్త చట్టాలు పెద్దపీట వేశాయి. అన్ని రంగాల్లో అవకాశాలు: మహిళలు రాత్రి షిఫ్ట్‌లతో పాటు గనులు వంటి ప్రమాదకర పనుల్లో కూడా పనిచేసేందుకు అనుమతించారు.

# నెహ్రూ రచనలు దేశానికి దిక్సూచి లాంటివి : రాహుల్ గాంధీ

లేకుండా ప్రజలకు అందుబాటులో ఉందని రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. చారిత్రక, ప్రజాస్వామ్య అవగాహనను ప్రోత్సహించడంలో ఇది కీలక ముందడుగు అని తెలిపారు. దీంతోపాటు భారతదేశ సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పడటానికి మార్గనిర్దేశం చేసిన పునాది ఆలోచనలతో పౌరులు పరిశోధించడానికి ఉపయోగపడుతుందన్నారు.

**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే ఛాన్స్**

కొత్తగా ప్రారంభించిన డిజిటల్ ఆర్కైవ్‌లో జవహర్ లాల్ నెహ్రూ వ్యాసాలు, లేఖలు, ప్రసంగాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి పరిశోధకులు, విద్యార్థులు, పౌరులు అధ్యయనం చేసుకోవచ్చు. ప్రస్తుతం కొన్ని రచనలు మాత్రమే అందుబాటులో ఉన్నా, భవిష్యత్తులో పూర్తిగా డిజిటల్ చేయనున్నారు. స్మార్ట్ ఫోన్‌లో సైతం ఉపయోగించుకునేలా నెహ్రూ రచనలను 'జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్' డిజిటలైజ్ చేసినట్లు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ప్రకటించారు. http://nehruarchive.inలో నెహ్రూ రచనలు అందుబాటులో ఉంటాయని వివరించారు. 1903-1964 కాలానికి చెందిన 'జవహర్‌లాల్ నెహ్రూ ఎంపిక చేసిన రచనలు' 100 సంపుటాల ప్రచురించారు. వీటిని అందరూ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోని సులభంగా అధ్యయనం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**మరిన్ని పుస్తకాలను ఇందులో చేర్చుతాం : జైరాం రమేశ్**

"ముందుగా 75,000 పేజీలు, 3,000 కంటే ఎక్కువ అంశాలను డిజిటల్ చేశాం. ఇంకా మరిన్ని అంశాలు, ఛాయాచిత్రాలు, ఆడియో, చిత్రాలను కవర్ చేయడానికి ఆర్కైవ్ విస్తరిస్తూనే ఉంటాం. ఆర్కైవ్‌ను విస్తరించేందుకు ప్రపంచవ్యాప్తంగా నెహ్రూకు, ఆయన నుంచి వచ్చిన లేఖలను కలిగి ఉన్న వారిని సంప్రదిస్తున్నారు. నెహ్రూ జీవితకాలంలో రాసిన, ఆయన గురించి ఉన్న పుస్తకాలను ఇందులో చేర్చుతాం." అని జైరాం రమేశ్ అన్నారు.

# నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ సర్కార్ చేయదు : కేటీఆర్

రాజీనామాకు అవకాశం ఇస్తున్నారు. సాంకేతికత సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారు." – కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

**హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం :** ఈ క్రమంలో ప్రైవేటు పరిశ్రమల పెట్టుబడి కోసం వచ్చినప్పుడు రాయితీగా భూకేటాయింపు జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. ఉపాధి కోసం రాయితీలు ఇచ్చి భూకేటాయింపు జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోతోందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో భారీగా భూకుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బాలానగర్, నాచారం, జీడిమెట్లలో భూ కుంభకోణం జరుగుతోందని వివరించారు.

9,300 ఎకరాల్లో భూ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపణలు చేశారు. రూ.5 లక్షల కోట్ల విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కేబినెట్ భేటీలో తెరలేపిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరులకు, బంధువులకు ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహించారు. హైదరాబాద్‌లో భూములు ఉన్న చోట రేవంత్‌రెడ్డి ముఠా వాలిపోతోందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఆలోచనలు మొత్తం భూములపైనే ఉంటాయని కేటీఆర్ తెలిపారు.

**పెరిగిన భూముల విలువలను ఏటీఎంగా మార్చారు :** మూసీ ప్రాజెక్టు, మెట్రోపై కుంభకోణాలకు తెరలేపిందని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూలో భూములపై కన్నేస్తే సుప్రీంకోర్టు ఆపిందని గుర్తు చేశారు. పెరిగిన భూముల విలువలను ఏటీఎంగా మార్చుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెరలేపిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

ఖరే నియమితులయ్యారు. ఎంబీఈఐటీ డీసీపీగా రూపేశ్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్, ములుగు ఎస్పీగా సుధీర్, కుమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీగా నితికా పంత్, టీఎస్ఎస్‌పీ ఆదిలాబాద్ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా కాంతిలాల్ సుభాశ్, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సిరిశెట్టి సంకేత్, మల్కాజిగిరి డీసీపీగా శ్రీధర్, వనపర్తి ఎస్పీగా సునీత తదితరులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐడీ డీజీగా పరిమళా నూతన్
పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.చేతన
మహేశ్వరం డీసీపీగా నారాయణ్ రెడ్డి
నార్కోటిక్ ఎస్పీగా పద్మ
మల్కాజ్ గిరి డీసీపీగా శ్రీధర్
సౌత్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే
నాగర్ కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్
వికారాబాద్ ఎస్పీగా స్నేహ మెహ్రా
టాస్క్ ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్
ములుగు ఎస్పీగా సుధీర్
భుపాలపల్లి ఎస్పీగా సంకేత్
వనపర్తి ఎస్పీగా సునీత
ఎస్ఎం ఐటీ డీసీపీగా రూపేశ్
మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్
ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖితా పంత్
నార్కోటిక్ ఎస్పీగా గిరిధర్
మ్ములుగు ఎస్పీగా సుధీర్ రామ్‌నాథ్
భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్
గవర్నర్ ఏడీసీగా పి.సుభాశ్
పెద్దపల్లి రామగుండం డీసీపీగా బి.రామ్‌రెడ్డి
కొత్తగూడెం ఓఎస్డీగా అవినాశ్
ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్
భువనగిరి ఏఎస్పీగా రాహుల్ రెడ్డి
జగిత్యాల ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి
ములుగు ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ
భైంసా ఎస్డీపీఓగా రాజేశ్ మీనా
ఆదిలాబాద్ ఏఎస్పీగా మౌనిక
ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్
నిర్మల్ ఏఎస్పీగా పి.సాయికిరణ్
వేములవాడ ఏఎస్పీగా రుత్విక్ సాయికొట్టె
సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర
టీజీ ట్రాన్స్ కో ఎస్పీగా శ్రీనివాస్
రాచకొండ క్రైమ్స్ డీసీపీగా గుణశేఖర్

# ఇంత జరుగుతున్నా సబిత ఇంద్రారెడ్డి స్పందించకపోవడం దారుణం: కవిత

మాజీ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులే చెరువులను కబ్జా చేస్తున్నారని ఆమె ఆరోపించారు. కబ్జాలపై ఆమె స్పందించకపోవడం దారుణమని కవిత విమర్శించారు.

హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు. మహేశ్వరంలోని రావిర్యాల, మంత్రాల చెరువులలో సబితా ఇంద్రారెడ్డి అనుచరులు కబ్జాలకు పాల్పడుతున్నారని, కానీ హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఆమె నిలదీశారు.

మున్ముందు ఈ కబ్జాలకు సంబంధించి పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తామని, వారు ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామని అన్నారు. హైడ్రా ప్రత్యేకంగా సర్టిఫైడ్ ఏజెన్సీగా ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. కబ్జాలకు సంబంధించిన వివరాలను హైడ్రాకు ఇస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వెళతారేమోనని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తనకు తెలిసిందని ఆమె అన్నారు.

## ఆర్టీసీ తొర్రూరు డిపో డీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన రీజియన్ బీసీ నేత వేణు



తొలి సమయం తొర్రూర్ నవంబర్ 21తొర్రూర్ డిపో మేనేజర్ వెన్నెల పద్మావతిని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గొలనకొండ వేణు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నిరంతరం సంస్థ ఉన్నతి కోసం పాటుపడుతున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన డీఎంతో చర్చించారు. న్యాయపరంగా సమస్యలను పరిష్కరించవలసిందిగా ఈ సందర్భంగా వేణు ఆమెను కోరారు. విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులకు ఎదురవుతున్న కష్టాలను కూడా సానుకూలంగా పరిగణంలోకి తీసుకొని పరిష్కరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమస్యల సాధన కోసం కృషి చేస్తానని, డీఎం సానుకూలంగా స్పందించారు .

## విలేకర్‌పై తప్పుడు ఆరోపణలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




తొలి సమయం తొర్రూర్ నవంబర్ 21 తొర్రూరు పట్టణ కేంద్రంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్య జరిగిన పంచాయతీ వ్యవహారంలో తాను ఎలాంటి జోక్యం చేసుకోలేదని, తనపై ₹5,000 అడిగాడనే తప్పుడు ఆరోపణలు పూర్తిగా అసత్యమని పేర్కొంటూ రిపోర్టర్ వి,మహేష్ అధికారికంగా ఫిర్యాదు చేసిన ఘటన చోటుచేసుకుంది.మంగళపల్లి ప్రసాద్ యాకాంత లు విలేకర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలలో అవమాన పరుస్తూ విలేఖరి పేరును దుర్వినియోగం చేస్తున్నాడని భావించి, సంబంధిత ఆధారాలతో తొర్రూరు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు మహేష్ తెలిపారు.విలేకర్లను లక్ష్యంగా చేసుకుని ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం తీవ్రంగా తప్పు అని, నిజాలు బయటకు రావడానికి పోలీస్ వ్యవస్థ సరైన దర్యాప్తు చేయాలని మహేష్ డిమాండ్ చేశారు.పత్రికారంగం ప్రజల కోసం పనిచేసే రంగమని, విలేకర్లపై ఇలా అవాస్తవ ఆరోపణలు చేయడం పత్రికార అభ్యున్నతికి ముప్పు అని స్థానిక పాత్రికేయ సంఘాలు ఐక్యంగా స్పందిస్తున్నాయి.పోలీసులు ఈ ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

## అక్షర హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి పరీక్షల నిర్వహణ




తొలి సమయం దంతాలపల్లి నవంబర్ 21:దంతాలపల్లి మండల కేంద్రంలోని అక్షర ఉన్నత పాఠశాల లో జన విజ్ఞాన వేదిక చెకుముకి విజ్ఞాన శాస్త్ర సంబరాలు,మండల స్థాయిలో భాగంగా మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు , ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ట్రస్మ నూతన అధ్యక్షులు అక్షర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ సింగారపు యాకయ్య మాట్లాడుతూ, సమాజంలో మూఢనమ్మకాల పట్ల ప్రజలను చైతన్యం ఎంపొందించేలా జన విజ్ఞాన వేదిక వారు చేస్తున్నటువంటి కృషిని కొనియాడారు అదే విధంగా పిల్లలు కూడా ప్రతి విషయాన్ని విజ్ఞాన శాస్త్ర కోణంలోనే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థిని విద్యార్థులు ఆసక్తిని, అభిరుచిని, సందేహాల నివృత్తిని పెంపొందించుకోవాలని తద్వారా ఉన్నత చదువులలో విజ్ఞాన శాస్త్రంలో అనువర్తనం విధానాన్ని కొనసాగించాలని విలువైన సమాచారాన్ని అందించారు, తదుపరి మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులకు మెమెంటోల బహుకరణ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యదర్శి టి. శ్రీధర్ చకుముకి పరీక్షల కన్వీనర్ టి.రఘురాం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# యతి రాజారావు పార్కులోని జిమ్ మెయింటెనెన్స్ లేదు

### మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్



తొలి సమయం తొర్రూరు నవంబర్21 తొర్రూరు యతి రాజారావు పార్క్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కు ఇచ్చారు కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించి నా వాకర్స్ యతి రాజారావు పార్కులోని జిమ్ లోనే కొన్ని పరికరాలు టాయిలెట్స్ పాడైపోయి ఉన్నాయి వాటిని తొందరగా రిపేర్ చేయించి వాకర్స్కు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు రు కమిషనర్ను కలిసిన వారిలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి రవీందర్ కార్యదర్శి ఎక్కడి నాగిరెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ కావటి మంగమ్మ సలహాదారులు బోడ బాలాజీ రాయిశెట్టి వెంకన్న సొంటి రెడ్డి భాస్కర్ రెడ్డి సోమ రాములు మూఢం సోమనర్సయ్య తాళ్లపల్లి బిక్షపతి నరేడ్ల రాము తదితరులు పాల్గొన్నారు

# పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయండి

### కేంద్ర మంత్రి జయంత్ సింగ్ చౌదరి ని కోరిన టిఆర్.ఎల్డి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్



తొలిసమయం, కొత్తగూడెం, నవంబర్ 21 : భద్రాద్రి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరించాలని రాష్ట్రీయ లోక్ దళ్ జాతీయ అధ్యక్షులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ మంత్రి జయంత్ సింగ్ చౌదరిని ఆ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్ కోరారు. తెలంగాణ పర్యటన సందర్భంగా హైదరాబాద్ వచ్చిన రాష్ట్రీయ లోక్ దళ్ జాతీయ అధ్యక్షుడు జయంత్ సింగ్ చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసిన కట్ట సతీష్ జిల్లాలో పార్టీ పటిష్టత కోసం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేవలం సింగరేణి కంపెనీ మీద ఆధారపడి జీవనం కొనసాగించిన నాటి నుండి ఇప్పటి వరకు అనేక మార్పులు జరిగినప్పటికీ జిల్లా కేంద్రం కొత్తగూడెం తో పాటుగా ఇల్లందు ప్రాంతంలో కొత్త పరిశ్రమలు లేక నిరుద్యోగ యువత ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతన పరిశ్రమలు నెలకోల్పేందుకు సహకరించాలని కట్ట సతీష్ కోరారు. పరిశ్రమల స్థాపనతో జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేయాలని కోరారు.

# మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం




తొలి సమయం మహబూబాబాద్, నవంబర్.21 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి ముఖ్య అతిథిగా పాల్గొని చేప పిల్లల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 17 చెరువులో గాను ఇప్పటికే కొన్ని కబ్జాదారుల కోరల్లో ఉన్నటువంటి వాటిని విడిపించి ఎఫ్ టి ఎల్ ఏర్పాటు చేసి బఫర్ జోన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.చెరువు శిఖాలలో ఎలాంటి నిర్మాణాలను ఇతరులు చేయకూడదని సభాముఖంగా కబ్జాదారులను హెచ్చరించారు. మా ప్రభుత్వం నాణ్యమైన చేపపిల్లను పంపిణీ చేస్తున్నదని అట్టి చేపలతో మత్యకారులు అభివృద్ధి బాటలో పయనించాలని వారు కోరారు ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం రెండు నియోజకవర్గాల్లో విజయవంతంగా పోయడం జరుగుతుందని నాణ్యమైన చేప పిల్లలు కొలత సరి చూసుకునే మేము ఈ చెరువులలో వదలడం జరుగుతుందని వారు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, చీఫ్ ప్రమోటార్ శ్రీ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ 350 చెరువులు, 72 సొసైటీలు, 4099 మంది సభ్యులు ఉన్నటువంటి మహబూబాబాద్ నియోజక వర్గములో నేటి నుంచి ప్రారంభమైన ఉచిత చేప పిల్లల పంపిణి కార్యక్రమం సజావుగా జరగాలని సొసైటీ అధ్యక్షులు సభ్యులు చెరువు దగ్గరకు వచ్చినటువంటి చేప పిల్లలను సరిచూసుకొని కొలత ప్రకారం లెక్క ప్రకారం తీసుకొని చెరువులలో పోసుకోవాల్సిందిగా కోరారు. ఉచిత చేప పిల్లలు పోసుకొని అభివృద్ధి బాటలో ప్రయాణించాలని ప్రభుత్వము మత్స్యకారుల కోసం ఒక ప్రత్యేకమైన కార్యక్రమం మత్స్యకారుల కొరకే ప్రవేశపెట్టింది అట్టి పథకాన్ని మత్యకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ దామేర శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు సింగాని అశోక్, కార్యదర్శి పిల్లి దశరథ నడిగడ్డ సంఘ అధ్యక్షులు అనుమతులు గడ్డ సంఘ అధ్యక్షులు గంగపుత్ర సంఘల అధ్యక్షులు నడిగడ్డ అధ్యక్షులు కొప్పు వీరయ్య సెక్రెటరీ కోళ్ల నాగరాజు కోశాధికారి ఐలయ్య హనుమంతుని గడ్డ అధ్యక్షులు గుర్రం వెంకన్న సెక్రెటరీ ఉత్సవ బాలకృష్ణ కోశాధికారి తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చెకముఖి టాలెంట్ టెస్ట్ క్వశ్చన్ పేపర్ విడుదల చేసిన జెవివి కమిటీ వివిధ.పాఠశాలల.ఉపాధ్యాయులు



తొలి సమయం పెబ్బేరు నవంబర్ 21పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ లో మండల స్థాయి చెక్కిముకి టాలెంట్ టెస్ట్ సైన్స్ సంబరాల క్వశ్చన్ పేపర్ ను జన విజ్ఞాన వేదిక మండల కమిటీ జిల్లా కమిటీ మరియు వివిధపాఠశాలలఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది ఇట్టి టాలెంట్ టెస్ట్ లోపాల్గొనడానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు.ప్రైవేటుపాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇట్టి టాలెంట్ టెస్టోపాల్గొన్నవిద్యార్థినీ.విద్యార్థులకు.మండలంలోని ప్రథమ స్థాయిలోకనబరచినవిద్యార్థులను ద్వితీయ స్థాయిలో కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికిఎంపిక.చేయడం.జరుగుతుందని జెవివి కమిటీ సభ్యులు తెలిపారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం.



తొలి సమయం, వనపర్తి, నవంబర్ 21ఈ కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ వీపనగండ్ల మండలంలోని కల్వరాల గ్రామంతో పాటుగా వల్లభాపురం, సంగినేనిపల్లి, సంపత్ రావు పల్లి గ్రామాలలో నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ వరి ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవ పూజ కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది.

### పరిపాలనను ప్రజల చెంతకు తెచ్చిన ఘనత కె.సి.ఆర్ ది



తొలి సమయం, వనపర్తి, నవంబర్ 21కె.సి.ఆర్ ముందు చూపుతో ఉత్పత్తులు,జీవనోపాధి పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగైనాయి హామీలు అమలు చేయలేని సి. ఎం.కు ఓట్లు అడిగే నైతికత లేదు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ విజయ దుందుభి మోగిస్తోంది.సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు. రెవెల్లి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఈరోజు నాగపూర్ గ్రామములో జరిగింది.ఇట్టి సమావేశానికి మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా గౌరవ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి ఒక్కటంటే ఒక్కటి అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతికత లేదని గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.కె.సి.ఆర్ తెలంగాణ సాధించిన తర్వాత ప్రణాళిక బద్ధంగా రాష్ట్ర అభివృద్ధి సాధించారని రైతాంగానికి సాగునీళ్లు,ఉచిత కరెంట్,పెట్టుబడి సాయం చేస్తూ కోటి ఎకరాలకు సాగు నీరు అందించారని కొనియాడారు ఉత్పత్తులు పెరిగి జీవనోపాధి కలిగి రైతులు రాజులా బ్రతికారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా రైతు రుణ మాఫీ రైతు బీమా అందకు సాగునీళ్ళు,కరెంట్ అందక 700మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు దేశములో రైతు బంధు,రైతు రుణ మాఫీ,రైతు బీమా అందించిన గొప్ప నాయకుడు కే.సి. ఆర్ అని 1000గురుకులాలు స్థాపించి ఎస్.సి,ఎస్.టి,బి. సి,మైనార్టీలకు ఉన్నత విద్యావంతులను చేశారని ప్రజలకు పాలన అందుబాటులోకి రావాలి అని జిల్లా కలెక్టరేట్ లు అందుబాటులోకి తెచ్చారని అన్నారు.పాలమూరు రంగారెడ్డినీ పాడవు పెట్టింది కాంగ్రెస్. 32వేల కోట్లు ఖర్చు పెట్టీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కె.సి.ఆర్ 90శాతం పూర్తి చేశారని కేవలం 1000కోట్లు ఖర్చు పెడితే ప్రాజెక్ట్ పూర్తి అయి 12లక్షల ఎకరాలకు నీళ్లు అందించవచ్చని కానీ కాంగ్రెస్ పార్టీకి పాలమూరు పచ్చబడడం ఇష్టం లేక పడావు పెట్టారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు.పరిపాలన సౌలభ్యం కోసం మండలాల ఏర్పాటు.ఉమ్మడి గోపాల్ పేట మండలములో పరిపాలన ప్రజల చెంతకు రావాలని రెవెల్లి,ఎద్దుల మండలాలు ఏర్పాటు చేశానని,ఆంజనేయుని గుడిలోని గ్రామము లేనట్లుగానే మన అభివృద్ధి పథకం తెలీని గ్రామము కూడా లేదని పునరుద్ఘాటించారు.పంచాయతీ ఎనికలకోసం మహిళలకు చీరలు అని కాంగ్రెస్ కపట నాటకం ఆడుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండి బి.ఆర్.ఎస్ పార్టీకి అండగా ఉండి స్థానిక సంస్థలలో గెలిపించాలని అన్నారు. నాయకులు కష్టపడి పని చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పట్ల స్పందించే నాయకులకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని అందుకే ప్రజల సమస్యలు తెలుసుకొని అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు కష్టపడి పనిచేస్తే బి.ఆర్.ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన అన్నారు.ఈ సమావేశములో నాగం.తిరుపతి రెడ్డి,జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,మాజీ జెడ్.పి.టి.సి.భీమన్న,మాజీ ఎం.పి.పి సేనాపతి,మాజీ వైస్ ఎం.పి.పి మధుసూదన్ రెడ్డి,శివరామి రెడ్డి,ఖాజా,శ్రీనివాస్ రెడ్డి,పాపులు,జగదీష్,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వేడుకలు



తొలి సమయం దంతాలపల్లి నవంబర్ 21: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని దంతాలపల్లి మండల కేంద్రంలో సొసైటీ అధ్యక్షుడు బాద నర్సయ్య ఆధ్వర్యంలో కుల పెద్ద మనుషులు రొయ్యల వెంకటయ్య మరియు గోనెల ఎల్లయ్య మహాసభ అధ్యక్షులు సమాక్షంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు, అనంతరం సొసైటీ అధ్యక్షుడు బాద నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఫులుగుజ్జ అశోక్,డైరెక్టర్స్ , పిడుగు మురళి,ఉప్పలయ్య,నర్సయ్య, కుల సభ్యులు సురేష్, వీరన్న, కృష్ణ,దేవేందర్, ప్రశాంత్, సంతోష్, వీరయ్య, మల్లేష్, మల్లయ్య, శశి, వెంకటయ్య, సోమయ్య,మరియు రాములు పాల్గొన్నారు

## బాధితులను పరామర్శించిన మల్లి బాబు యాదవ్, పుచ్చకాయల కాయల వీరభద్రం.





తొలి సమయం, కామేపల్లినవంబర్, 21. కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ బొడ్డు సునీత గారి అత్తయ్య గారు మరియు మండల కాంగ్రెస్ నాయకులు బొడ్డు లక్ష్మీనారాయణ గారి మాతృమూర్తి బొడ్డు సక్కుబాయి మరియు దివంగత మాజీ కాంగ్రెస్ నాయకులు ధరావత్ లాకు గారి సతీమణి ధరావత్ మీరి గార్లు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శుక్రవారం నాడు జరిగిన దశదినకర్మ కార్యక్రమాలలో మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం పాల్గొని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. , కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొంతమంది పార్టీ కార్యకర్తలుతో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఎంత తొందరగా ఇండ్లు నిర్మించుకుంటే ఇండ్ల బిల్లులు అంత త్వరగా మంజూరు అవుతాయని,ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని,రాబోయే గ్రామ పంచాయతీల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతోని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్, బానోతు నరసింహ నాయక్, నల్లమోతు మల్లికార్జున్ తోటకూరి శివయ్య నల్లమోతు రవి బొడ్డు లక్ష్మీనారాయణ, శీలం పుల్లయ్య గబ్రు నాయక్, కేలోత్ భాస్కర్ పుచ్చకాయల సత్యనారాయణ భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాదు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, దారావతలాలు, లాకు ప్రేమ్ కుమార్ భూక్య రవి, సోమన బోయిన మల్లికార్జున్, బాదావత్ నాగరాజు, బానోత్ మంగీలాల్, బానోత్ రాము, నాగేశ్వరరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బూటకపు ఎన్కౌంటర్లను ఖండిస్తూ ఇల్లెందులో వామపక్షాల నిరసన



తొలి సమయం, ఇల్లందునవంబర్, 21.ఎన్కౌంటర్ల పేరుతో మావోయిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలను కేంద్ర ప్రభుత్వం కాల్చి చంపడాన్ని ఖండిస్తూ శుక్రవారం ఇల్లందు బస్టాండ్ సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యంలో నల్ల జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు.

ఈసందర్భంగా సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు,సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఏ నబి,సిపిఐ మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ అశోకన్నవర్గం జిల్లా నాయకులు బానోత్ రాంసింగ్ మాట్లాడుతూ

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టేందుకు మావోయిస్టు పార్టీ నాయకులను,సానుభూతిపరులను పెద్ద ఎత్తున బూటకపు ఎకౌంటర్లలో కాల్చి చంపుతున్నారని విమర్శించారు. మావోయిస్టు నాయకుల నిర్మూలన ధ్యేయంగా బిజెపి ప్రభుత్వం పోలీస్ బలగాలను మోహరించి మావోయిస్టులపై యుద్ధం చేస్తూ అంతం చేస్తున్నాయని లొంగుబాటు కోసం వచ్చిన నాయకులను కూడా పట్టుకొని కాల్చి చంపుతున్నారనే ప్రచారం జరుగుతుందని అదేవిధంగా పోలీసు అదుపులో మావోయిస్టు ముఖ్య నాయకులు పోలీసుల అదుపులో ఉన్నారనే ప్రచారం విస్తృతంగా జరుగుతుందని నిజంగా పోలీసుల అదుపులో మావోయిస్టులు ఉంటే వారి ప్రాణానికి హాని తలపెట్టకుండా కోర్టులో అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని బూటకపు ఎన్కౌంటర్లను నిలిపివేయాలని, ఎన్కౌంటర్లపై న్యాయ విచరణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఈకార్యక్రమంలో నాయకులు కొక్కు సారంగపాణి,మోకాళ్ళ రమేష్,ఆలేటి కిరణ్,తాళ్లూరి కృష్ణ,భూక్య శివ,హతీరం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

**- ఇనుగుర్తి ఎస్సై గంగారపు కర్ణాకర్**

**- చెకుముకి పరీక్షతో విద్యార్థుల ప్రతిభ వెలికితీత**

**- ఇనుగుర్తి మండల స్థాయి చెకుముకి పరీక్ష విజయవంతం**



తొలిసమయం:ఇనుగుర్తి, నవంబర్ 21:విద్యార్థులలోని సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించే విషయంలో చెకుముకి పరీక్షల నిర్వాహణ అభినందనీయమని ఇనుగుర్తి ఎస్సై గంగారపు కర్ణాకర్ అన్నారు. ఇనుగుర్తి మండలంలోని స్తానిక ప్రభుత్వ పాఠశాలలో ఇనుగుర్తి, కోమటిపల్లి, చిన్నముప్పారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఇనుగుర్తి సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు చెకుముకి మండల స్థాయి పరీక్షను ఎంఈవో రూపారాణి సమక్షంలో ఇనుగుర్తి మండల జన విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి ఎస్సై గంగారపు కర్ణాకర్ మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ సంబురాలు ఏర్పాట్లు స్వలాభం కోసం కాకుండా, సమాజ శ్రేయస్సు కోసమని, విద్యార్థులకు శాస్త్రీయ దృకృథం కలిగించే విషయంగా ఈ ప్రశ్నలున్నాయని, బట్టీ పట్టి రాసే పరీక్ష మాదిరిగా కాకుండా, 3గురు టీంగా కలిసి రాయించడం వారి శాస్త్రీయ దృకృథానికి అద్దం పడుతుందని చెప్పారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, లక్ష్యం దిశగా ముందుకు పోవాలన్నారు.ఎంఈవో రూపారాణి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు శాస్త్రీయ దృకృథం ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందని, భవిష్యత్తు నాయకులుగా రూపొందడానికి జన విజ్ఞాన వేదిక విశేషంగా కృషి చేస్తుందని, చెకిముఖి సైన్స్ సంబురాలు అందులో ముఖ్య కార్యక్రమమని, అవగాహన కోసం సృజనోత్సవాలు, మహిళా దినోత్సవం, ఉగాది సంబరాలు, బతుకమ్మ సంబరాలు, సహజ రంగుల హెూలీ, పర్యావరణ హిత, ఆరోగ్య పరిరక్షణ, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పుల కోసం అవగాహన సదస్సు వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు.

అనంతరం జిల్లా స్తాయికి ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలను అందజేసి ఎంపికైన విద్యార్థులను ఎస్సై, ఎంఈవో, అతిథులు అభినందించారు.

జిల్లా స్థాయికి ఎంపికైన వారు:

1) ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు: ఎం.నవ్యశ్రీ, ఏ.మధుప్రియ, ఎ.నందిని2). తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులుకె.అమూల్య, కె.గీతిక, డి.అర్పితకార్యక్రమంలో విద్యాభివృద్ధి కమిటీ అధ్యక్షులు దార్ల రాంమూర్తి, కో కన్వీనర్ గంజి రాజేందర్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు దార్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి పొన్నం కవిత, గౌరవ అధ్యక్షులు చిన్నాల కట్టయ్య, గంజి వీరేందర్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ, జిల్లా దిశ కమిటీ సభ్యులు గుజ్జునూరి బాబురావు, కమిటీ సభ్యులు పింగిళి శ్రీనివాస్, గండు నాగన్న, పప్పుల వెంకన్న, గాడుదుల రాజాలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ యాకయ్య, సామల స్వప్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డపై సిపిఐ కు 100 ఏళ్ళు



తొలి సమయం, ఇల్లందునవంబర్, 21.

భారత కమ్యూనిస్టు శతజయంతి ఉత్సవాలలో భాగంగా నవంబర్ 15 నుండి 25 నవంబర్వరకు నిర్వహించి దలచిన ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇల్లందు చేరుకున్న బస్సు ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి , రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ , సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ కే సాబీర్ పాషా ,రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలకు స్వతంత్రం కోసం అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వెట్టి చాకిరి విముక్తి కోసం బానిసత్వం నుండి భూస్వాములు రజాకర్ల నుండి ప్రజలకు విముక్తి కల్పించి పేద ప్రజలకు లక్షల ఎకరాలను పంచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని నిరంతరం ప్రజా పోరాటాల్లో నిమగ్నమై న భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రచార జాతర నిర్వహించ దలచమని, ఖమ్మంలో డిసెంబర్ 26 నా 5 లక్షల మందితో ముగింపు ఉత్సవాలలో పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు అభిమానులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మారుతున్న రాజకీయాల నేపథ్యంలో ఐదేళ్లు అధికారంలో లేకుంటే కానరకుండా పోయే పార్టీలు ప్రజల అధికారంలో ఉన్నప్పుడు కనీసం ప్రజలు అవసరాలను కూడా తీర్చలేని పార్టీలకన్నా ఈరోజు వంట గ్యాస్ ధర పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిన నిత్యవసరల ధరలు పెరిగిన ఎల్లప్పుడు కార్మిక వర్గానికి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. మనకు అధికారం ఉన్న లేకున్నా ఈ దేశంలో ప్రజా సమస్యలపై కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో ఈ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఈరోజు అధికారం లేకుంటే రోజుకు జెండా పూటకో పార్టీ మార్చే నాయకులును మనం చూస్తున్నాం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ జెండా భుజాన వేసుకొని మళ్లీ మనకు నీతులు చెప్పడానికి ముందుకు వస్తారు, ఈరోజు ఇక్కడ స్థానిక నియోజకవర్గం నాయకులను శాసన సభ్యులు లను మేము అడుగుతున్నాం ఒకప్పుడు కార్మికులతో కళకళలాడిన ఇల్లందు ఈరోజు మూగబోయిందని ఉన్న బొగ్గు భావులు మూతపడి కార్మికులందరూ వేరే చోటుకి ట్రాన్సర్ అయిపోయారు అని మళ్లీ తిరిగి ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తూ అభివృద్ధి దిశగా ప్రయాణించడానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించడమే కాక ప్రభుత్వంతో మాట్లాడి ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అదేవిధంగా 21 ఫీట్ ఏరియా సింగరేణి నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకటించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఈ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించి, కొమరారం, బోడు, సుదిమల్ల మండలాలుగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి నీటి వనరులు తీసుకువచ్చి ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఈ ప్రభుత్వం పైన ఉందని వారు అన్నారు ఈ ప్రచార జాతలో, మహబూబాబాద్ పార్టీ జిల్లా కార్యదర్శి బి విజయసామిరెడ్డి, డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాశిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్,బంధం నాగయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు బాస శ్రీనివాసరావు,బొప్పి శెట్టి సత్యనారాయణ,బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉమ్మగాని హరీష్,మాజీ కౌన్సిలర్ రవీందర్,బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి రాజారాం,తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై వ్యాపారులకు అవగాహన



తొలి సమయం, ఇల్లందునవంబర్,21. ఇల్లందు పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలో ఆర్యవైశ్య మహాసభ, అగ్నిమాపక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూ చౌక్ (కూరగాయల మార్కెట్) సమీపంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు డి.ఎస్.పి చంద్ర భాను హాజరై వ్యాపారులు, స్థానిక ప్రజలకు అగ్ని ప్రమాదాల సందర్భంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, జాగ్రత్తలపై బేసిక్ శిక్షణ అందించారు.

ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా సంభవిస్తాయో ఊహించడం కష్టమని, కానీ ముందస్తు జాగ్రత్తలు, సురక్షిత చర్యలతో ప్రాణ నష్టం,ఆస్తి నష్టాన్ని తప్పించుకోవచ్చని సూచించారు. ప్రతి వ్యాపార స్థావరంలో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు తప్పనిసరిగా ఉంచుకోవాలని, అవి పని చేస్తున్నాయో లేదో సమయానుకూలంగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన సందర్భంలో వెంటనే అంబులెన్స్, ఫైర్, పోలీస్ శాఖలకు సమాచారం చేరవేయడం అత్యంత కీలకమని చెప్పారు.

అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యక్ష డెమో నిర్వహించి అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక నియంత్రణ పద్ధతులపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ రకాల అగ్నిప్రమాదాలకు ఏ పరికరాలు ఉపయోగించాలి, వాటి వినియోగం ఎలా ఉండాలి, ప్రమాదాన్ని ఎలా నియంత్రించాలి అనే అంశాలపై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్లు ఎస్ఎఫ్ఓ జి. రామారావు, టి. నాగరాజు, బి. అఖిల్, ఎం. శివకుమార్, మల్సూర్, ఆర్యవైశ్య మహాసభ నాయకులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, తాటిపల్లి సుబ్బారావు, పల్లెర్ల చంద్రశేఖర్, నారాయణదాసు లాహుటి, చందా భద్రం, మనోహర్ తివారి, తాటిపల్లి లక్ష్మణరావు, సైఫా శ్రీనివాస్, సైఫా రాజు, గందే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న లింగమంతులు అలయంకు మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ విరాళం



తొలి సమయం దంతాలపల్లి నవంబర్ 21: దంతాలపల్లి మండలందాట్ల గ్రామంలో యాదవుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న యాదవ కులదైవం లింగమంతుల స్వామి నూతన అలయంకు జిల్లాకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, దాట్ల గ్రామ మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ తన తండ్రి కొమ్మినేని రామయ్య జ్ఞాపకర్థంగా రూ,25,000/-లు విరాళంగా అందించారు.అడిగిన వెంటనే సహకరించిన మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్కి యాదవ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..ఈకార్యక్రమంలో సారకొల్ల గొల్ల మున్న లింగమల్లు, బోర రాజయ్య, కొండ కిష్టయ్య, వీరబోయిన లింగయ్య, ఆవుల సోమయ్య, ఆవుల లింగయ్య, పచ్చిపాల చంద్రయ్య, ఆవుల వీరయ్య, భయ్యా లింగయ్య, జెటంగి దేవేందర్, ఉప్పుల మహేష్, గూండాల మహేష్, గూండాల రమేష్, పచ్చిపాల మధు, గూండాల పప్పి, గూండాల ఐలయ్య, కొండ వీరయ్య, మున్న నాగమల్లు తదితరులు పాల్గొన్నారు.

## మహాబాద్,గుండాల. వైపు నుండి వచ్చే బస్సులు పాత పద్ధతి ప్రకారమే బస్టాండ్ లోకి వెళ్ళాలి డిపో ఇంచార్జీ కి సీఐటీయు వినతి



తొలి సమయం, ఇల్లందునవంబర్, 21.స్థానిక కొత్త బస్టాండ్ వద్ద కొత్తగూడెం, ఖమ్మం వైపు నుండి వచ్చే బస్సులు ఇన్ గేట్ నుండి మహాబాద్ గుండాల వైపు నుండి వచ్చే బస్సులు ఔట్ గేటు నుండి రాకపోకలు సాగించేవి ఇపుడు కొత్త పద్ధతిలో ఇన్ గేటు నుండి రాకపోకలు కొనసాగించాలని డిపో అధికారులు సూచించడం వల్ల మహాబాద్ గుండాల వైపు నుండి వచ్చే బస్సులకు చాల కష్టమౌతుంది అంతే కాక మ్యాజిక్, ఆటో అడ్డాలు ట్రాఫిక్ ఆర్టీసీ గేటు దగ్గర వైన్స్ షాపు ఉండటం వల్ల ఆర్టీసీ బస్సు వెళ్లడం చాలా ఇబ్బంది కలుగుతుందని పాత పద్ధతి ప్రకారమే బస్సులు ఇన్ ఔట్ కొనసాగించాలని సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ ఇల్లందు ఏరియా కార్యదర్శి అబ్దుల్ నబి కోరారు. ఈ సందర్భంగా ఇల్లందు ఆర్టీసీ డిపో ఇంచార్జీ సునీత గారికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమం లో తాళ్లూరి కృష్ణ , తోట శివకృష్ణ,ఇమానియల్,సుందర్, రాజేష్ కొమరారం,పోలారం,మాణిక్యారం,మర్రిగూడెం ఆటో అడ్డాల ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి 5వేల ఆర్థిక సహాయం

### కాంగ్రెస్ నాయకుడు కావలి గోవింద్



తొలి సమయం పెబ్బేరు నవంబర్ 21 పెబ్బేరు మండల పరిధి శాఖపూర్ (వై) గ్రామానికి చెందిన తెలుగుపెంచికలపాడు శాంతయ్య అనే వ్యక్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నడుము విరిగి కాలు ప్యాక్చర్ అయింది. కదలలేని స్థితిలో ఉన్నఈ విషయాన్ని స్థానిక గుర్రం సోదరుల ద్వారా తెలుసుకున్నా పెబ్బేర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావలి గోవింద్ శుక్రవారం ఉదయం తెలుగు పెంచికలపాడు శాంతయ్యను పరామర్శించి,ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉండడానికి ఇల్లు లేని సెంటు భూమి కూడా లేని నిరుపేద కుటుంబానికిచెందినశాంతయ్యకు వైద్య ఖర్చుల నిమిత్త 5వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు మెరుగైన వైద్యం కోసం స్థానిక ఎమ్మెల్యే మెఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎల్ ఓ సి కోసం తమ వంతు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగు మద్దన్న,తెలుగు చిన్న కృష్ణయ్య,గుర్రం అంజి,గొల్ల పెద్ద కురుమన్న,జలివాల మ

## బీసీల రణభేరిని విజయవంతం చేయండి

### వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ




తొలి సమయం, వనపర్తి, నవంబర్ 21బీసీ రిజర్వేషన్ బిల్లును రాజ్యాంగం లోని తొమ్మిదవ షెడ్యూలులో చేర్చాలనే డిమాండుతో...బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 23న పాలమూరు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న "బీసీల రణభేరి" బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్థానిక నాయకులతో కలిసి రణభేరి బహిరంగసభ గోడ పత్రికలను ఆవిష్కరించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బిల్లును వచ్చే శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి రాజ్యాంగ రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు.బీసీల సామాజిక న్యాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం అని, ఇది బీసీలను రాజకీయంగా వెనక్కి నెట్టే కుట్ర అని మండిపడ్డారు.నామినేటెడ్ పదవులను జనాభా ప్రాతిపదికన బీసీలకు కేటాయించాలని,పాలమూరు జిల్లాకు పండుగ సాయన్న పేరును పెట్టాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ పరిరక్షణ కోసం, బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని, బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.వేలాది మందితో రణభేరి మోగించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మన న్యాయమైన హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు వివి గౌడ్, అంజన్న యాదవ్,ధర్మేంద్ర సాగర్, బత్తుల జితేందర్, రాఘవేందర్ గౌడ్, ఆస్కని రమేష్, చెలిమిల్ల రామన్ గౌడ్, నరేందర్ సాగర్, రమేష్ గౌడ్ .రవి సాగర్పాల్గొన్నారు.

## మావోయిస్టు నేతలు దేవ్‌జీ, రాజిరెడ్డిపై హెబియస్ కార్పస్ పిటిషన్ క్లోజ్

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు మూసివేసింది. వారిద్దరూ పోలీసుల నిర్బంధంలో ఉన్నారని నిరూపించడానికి ప్రాథమిక ఆధారాలు లేనందున ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అయితే, భవిష్యత్తులో సరైన ఆధారాలు లభిస్తే మళ్లీ కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు జస్టిస్ సి. మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ జి. తుహిన్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

దేవ్‌జీ, రాజిరెడ్డిలను వెంటనే కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దేవ్‌జీ సోదరుడు తిప్పిరి గంగాధర్, రాజిరెడ్డి కుమార్తె స్నేహలత హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. గురువారం జరిగిన విచారణలో, వారిద్దరూ పోలీసుల అదుపులోనే ఉన్నారని చెప్పడానికి ఆధారాలు సమర్పించాలని ధర్మాసనం పిటిషనర్లను ఆదేశించింది.శుక్రవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా, పిటిషనర్ల తరఫు న్యాయవాది యు. జైభీమారావు వాదనలు వినిపించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలు, ఛానళ్లలో ప్రసారమైన వీడియోలను ఒక పెన్‌డ్రైవ్‌లో కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. అయితే, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి. విష్ణుతేజ వాదిస్తూ.. పోలీసు ఉన్నతాధికారుల ప్రెస్‌మీట్‌లో కీలక నేతల భద్రతా సిబ్బంది 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారే తప్ప, దేవ్‌జీ, రాజిరెడ్డిల గురించి ప్రస్తావించలేదని స్పష్టం చేశారు.

# భారత్ చేతిలో హసీనా శ్వాస

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. బంగ్లా దేశంలో అల్లర్లకు కారణమైన హసీనా ప్రస్తుతం భారత్ లోనే ఉంటోంది. మరణ శిక్ష... ఇదేమీ ఊహించనిది కాదు. అధికారంలో ఉన్నా లేకున్నా చట్టా నికి ఎవరూ అతీతులు కారు అనేది న్యాయ పరిభాషలో సూత్రంగా వర్తిస్తుంది. లోకకళ్యాణం కోసం దేశాధినేతలు తీసుకునే ప్రతి నిర్ణయం సక్సెస్ అవ్వకపోవచ్చు. కానీ వాళ్లు దేశ విధ్వంసానికి పాల్పడుతున్నారని చెప్పడం అతీతం కాదనే అనుకోవాలి. హసీనా అంటే చిన్న స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి అనుకోవడం కాదు... ఆమె బంగ్లాదేశ్ మొట్టమొదటి ప్రధాని ముజిబుల్ కుమార్తె. ఆ దేశ ఏర్పాటు, నిర్మాణంలో పాలు పంచుకున్న కుటుంబం. ఎంతో కొంత దేశభక్తి లేకుండా ప్రధాని బాధ్యతలు స్వీకరించారంటే మామూలు విషయం కాదు. ఆ కుటుంబం చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించేందుకు ముజిబుర్ ఎంతో కృషి చేసింద్రు.

ప్రజల్లోంచి ఉద్యమాలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించడమో, లేకుంటే అణచివేయడమో ప్రభుత్వాలు చేయగలిగిన పని. ఆమె కూడా అదే చేశారు. అయితే కొన్ని నిర్ణయాలు ప్రజలకు నచ్చకపోవచ్చు. వాటినే బూచిగా చూపి విపక్షాలు కూడా జనాన్ని చైతన్య వంతుల్ని చేసి ఇరికించే శ్రమ తీసుకున్నారేమో.... అనిపిస్తుంది. బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తింది. అదే ఉద్యమానికి దారి తీసింది. జూలై 15న విద్యార్థులు ఉవ్వెత్తున చేసిన తిరుగుబాటు ను ఉక్కుపాదంతో అణచివేయాలని హసీనా తీర్మానించారు.

అయితే హసీనా నిర్ణయం ఎక్కడో బెడిసి కొట్టి... 1400 మంది మృతికి ఆ నిర్ణయం కారణమైంది. మానవత్వాన్ని మరచి ఎంతో మంది బలైపోవడానికి ఆమె నిర్ణయం దారి తీసింది. దీంతో జనాగ్రహం వ్యక్తమైంది. ఉద్యమాన్ని కట్టడి వ్యూహాలకు కర్త, కర్మ, క్రియా హసీనాయేనని ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం అభియోగాలు మోపింది. కాగా ఉద్యమ సమయంలో ఉద్యమ కారులపైకి హసినా తమ సొంత పార్టీ అవామీ లీగ్ కార్యకర్తలను కూడా ఉసికొల్పారని ఆరోపణలు. ప్రజా స్వామ్య పునాదుల పునరుద్ధరణకు తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహ మ్మద్ యూనస్ మాత్రం హసీనాకు పడిన మరణ శిక్ష సబబే అని వ్యాఖ్యానించారు. కాగా ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత తీర్పుయని, ఒక అనామిక ప్రభుత్వం ఒత్తిడితో వెల్లడైన తీర్పుగా హసీనా పేర్కొన్నారు.

1975లో సైనిక తిరుగుబాటులో తల్లిదండ్రులు, ముగ్గురు సోద రులు, మరికొందరు కుటుంబ సభ్యులు హతమయ్యారు. అనంతరమే ఆమె దేశ రాజకీయాల్లోకి ప్రవేశించాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ ట్రిబ్యునల్ ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కు కూడా మరణశిక్ష విధించింది. మాజీ ఐజి చౌదరి అబ్దుల్లా అల్ మమూల్ కు ఐదేళ్ల శిక్ష పడింది. ఒక దేశంలో కానీ, ఒక రాష్ట్రంలో కానీ పాలకుల పట్ల విపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉద్యమిం చినప్పుడు, వారిని దారిలోకి తెచ్చు కోవాలని ప్రయత్నాలు ఉంటాయి. అది ప్రభుత్వ బాధ్యత. తాత్కాలిక ప్రభుత్వం ఉద్యమకారులకు చేసిందేమీ లేదు. కానీ హసీనాకు శిక్షపడిందంటేనే అది వారికి న్యాయం జరిగినట్లు భావించాలని చెబుతోంది.

ఇదిలా ఉంటే హసీనాకు శిక్ష అయితే వేయగలిగారు కానీ... ప్రస్తుతం ఆమె భారత్ లో ఉంది. ఎక్కడో రహస్యంగా దాక్కోలేదు. ఆమెకు భారత ప్రభుత్వం రక్షణ కల్పి స్తోంది. బంగ్లాలో నిరసనకారులను చిత్రహింసలకు గురి చేయడం, విద్యార్థులపైకి దాడి చేసిన చర్యలకు జవాబుదారీగా ఆమెను ట్రిబ్యునల్ అభిశంసించింది. విద్యార్థులపై దాడి జరిగేలా హసీనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిందని మరో ఆరోపణలున్నాయి. ఏదిఏమయినా ముస్లిం దేశాలలో అధికారపక్షాన్ని తిరుగుబాటుతో పడగొట్టడమనేది తరచు జరిగే ప్రక్రి య. గతంలో ఆయా ప్రభుత్వాలను సైన్యమే కూలదోసేది. కానీ ఇక్కడ బంగ్లాదేశ్ విషయం వేరు. ఇక్కడ ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసిన సైన్యం కూడా మాటవడాల్సి వచ్చింది.

ప్రస్తుతం భారత్లో ఉన్న హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించుకొని మరణశిక్ష అమలు చేయాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం కొత్త వ్యూహాలు పన్నుతోంది. బంగ్లాదేశ్లో మరణశిక్ష విధించబడిన షేక్ హసీనాను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ భారత్ కు విజప్తి చేసింది. భారత్, బంగ్లా మధ్య ఉన్న ఒప్పందం మేరకు షేక్ హసీనా ను తమకు అప్పగించడమే తక్షణ కర్తవ్యమని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం భారత్ ను కోరుతోంది. అయితే బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలు కాపాడే దిశగా శాంతి ప్రజాస్వామ్యం, స్థిరత్వం కలిగేటట్లు తమ దేశ నిర్ణయాలు ఉంటాయని భారత్ ప్రకటించింది.

ఈ రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందంలో హత్య, ఉగ్రవాదం, వంటి నేరాలు మినహా రాజకీయ స్వభావమున్న నేరాల్లోని నిందితులను అప్పగించకుండా భారత్ తిరస్కరించే అవకాశముంది. రాజకీయ ప్రేరేపిత ఒప్పందాలను తిరస్కరించే అధికారం భారత్ కు ఉంది. హసీనా విషయంలో ఆమె భవితవ్యం భారత్ తో ముడిపడి ఉంది. ఇప్పుడు భారత్ దేశ నిర్ణయం... హసీనాను అప్పగిస్తుందా, లేదో చూడాల్సిందే....

పట్ట. హరి ప్రసాద్, రైటర్
ఫోన్: 8790 84 3009

# శరీరం లో వచ్చే మానసిక, శారీరక ప్రతిస్పందనే మానసిక వత్తిడి...

## జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాథోడ్



**తొలి సమయం మహబూబాబాద్,నవంబర్.21**జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యం లో జిల్లాలోని అన్నీ గురుకుల ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలో మానసిక ఒత్తిడి నిర్వహణ పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని దీనిలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ, మానసిక వొత్తిడి అనేది మన జీవితంలో తప్పించుకోలేని భాగ%శీ% అని దీన్ని ఎలా నియంత్రించాలో తెలిస్తే, అది మన అభివృద్ధికి ఉపయోగపడే శక్తిగా మారుతుందని పేర్కొంటూ ఒత్తిడి, ఆందోళన, భయం లేదా బాధ కలిగించే పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు మన శరీరంలో వచ్చే మానసిక, శారీరక ప్రతిస్పందనను మానసిక వొత్తిడి అంటరని అన్నారు. మానసిక ఒత్తిడి కి కారణాలు ముఖ్యంగా, వ్యక్తిగత ఉద్యోగ సంబంధిత, చదువు సంబంధిత, కుటుంబ సమస్యలు పని ఒత్తిడి, పరీక్షల ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, సహచరులతో వివాదాలు, టైమ్ మేనేజ్మెంట్ లోపం వల్ల జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ, పరీక్షల కి ముందు మానసిక ఒత్తిడి కలగడం సహజం అని, పరీక్షలు అంటే భయం లేకుండా, ఏరోజు విషయాలు ఆరోజు చదువుకోవాలని, టైం మేనేజ్మెంట్, నిద్ర ఆరు నుంచి ఎనిమిది గంటలు పడుకోవాలని, యోగ, మెడిటేషన్ చేయాలని పేర్కొంటూ, పోషకాహారం తీసుకోవాలని, త్వరలోనే వార్షిక పరీక్షలు ఉన్నందున మానసికంగా ఆందోళన చెంద కూడదని, విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి నారాయణ, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైస్ ప్రిన్సిపల్ వాణి ప్రియ, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.వి రాజు, పురుషోత్తం, గీత, హెచ్ ఈ ఓ రామకృష్ణ, శ్రీనివాస్, స్వామి, సూపర్వైజర్ పుష్పలీల ,కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ నాగరాజు,వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినిలు పాల్గొన్నారు .

# వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బదిలీ నుతన ఎస్పీగా డి.సునీత






తొలి సమయం, వనపర్తి, నవంబర్ 21అనతి కాలంలోనే బదిలీ బదిలీపై జిల్లా ప్రజల విస్మయవనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బదిలీ అయ్యారు. అనతి కాలంలోనే వనపర్తి జిల్లా ఎస్పీ గా గత సంవత్సరం జూలై 15న పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన బదిలీ పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లా నుంచి హైదరాబాద్ తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టీజీ నాబ్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తెలంగాణ డిజిపి కార్యాలయం నుంచి డి సునీత జిల్లా ఎస్పీ గా బదిలీపై వచ్చారు. వనపర్తి జిల్లా ఎస్పీ గారు రెండు సంవత్సరాల కాలం కూడా పూర్తికాకముందే రావుల గిరిధర్ ఎస్పీ బదిలీ కావడం బాధాకరం జిల్లాలో విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ తోటి సిబ్బందిని ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తూ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా డ్యూటీ మైండ్ గా పెట్టని పేరు తెచ్చుకున్నారు. జిల్లాలో ముఖ్యంగా శాంతి భద్రతలతో పాటు మహిళల వేధింపులను రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న సైబర్ నేరాలు, దొంగతనాలు దోపిడీలు, హత్యలు అత్యాచారాల పైన ఆయన కఠినంగా వ్యవహరిస్తూ ఈ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ రాష్ట్రంలోనే వనపర్తి జిల్లా శాంతిభద్రతలకు పెట్టను పేరుగా తెచ్చారు. ఒకపక్క విధి నిర్వహణలో నిరంతరం ప్రజల కోసం శాంతి భద్రతల కోసం పనిచేస్తూ మరోపక్క యువత మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఆయన నడుము బిగించారు. గంజాయి గుట్కా పాన్ మసాలా, తో పాటు ట్రాఫిక్ సమస్యతో పాటు త్రిబుల్ రైడింగ్ మద్యమం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులపైన కఠినంగా వ్యవహరిస్తూ ఉన్నది ఉన్నట్లు లేనిది లేనట్లు మాట్లాడే తత్వం కలిగిన ఎస్పీగా ఆయన జిల్లాలో పేరు తెచ్చుకున్నారు. కొంతమంది నిజాయితీగా పనిచేస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేయడం బాధాకరమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక క్షణం కూడా ఆయన విరామంగా లేకుండా తాను నిద్రపోకుండా తన సిబ్బందిని కూడా నిద్రపోకుండా వివిధ నిర్వహణలో అంకితభవంతో పనిచేయాలని ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్స్ సెట్ కాన్ఫరెన్స్, లో సిబ్బందిని అలర్ట్ చేస్తూ జిల్లాలో ఎక్కడ కూడా ఏ అధికారి కూడా అవినీతి అక్రమాలకు దూరంగా ఉన్నారు. జిల్లా ఎస్పీ బదిలీ జరిగిన నేపథ్యంలో జిల్లా పోలీసులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయన చేసిన సేవలను కృషిని ఒకసారి ప్రజలకు గుర్తు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

దిన పత్రిక తొలి సమయం

శనివారం 22 నవంబర్ 2025

## విద్యార్థి దశ నుండే శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేందర్ రెడ్డి , ఎంఈఓ బుచ్చయ్య




తొలి సమయం తొర్రుర్ నవంబర్ 21: విద్యార్థి దశనుండే పిల్లలు శాస్త్రీయంగా ఆలోచిస్తూ తార్కిక మరియు వివేచన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజేందర్ రెడ్డి తొర్రూరు మండల విద్యాశాఖాధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు జనవిజ్ఞాన వేదిక తొర్రుర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను స్థానిక %గ్లానూ% తొర్రూరు హైస్కూల్ లో నిర్వహించారు ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ ,రెసిడెన్షియల్ మరియు ప్రైవేట్ పాఠశాల నుండి 21 టీంలు పాల్గొన్నాయి

ఈ సందర్భంగా జేవీవీ మండల అధ్యక్షులు తాళ్ల పెల్లి రమేష్ అధ్యక్షతనమండల గౌరవ అధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు రాయి పెల్లి యాకయ్య సమన్వయంతో జరిగిన ప్రశ్నాపత్రాల ఆవిష్కరణలో మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జల్లా లక్ష్మీనారాయణ ఛాంబర్ ఆ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్ మరియు విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానోత్సవం లో లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి యం ఈ ఓ బుచ్చయ్య ముఖ్యఅతిదులు గా పాల్గొని బహుమతులు మెమొంటో మరియు ప్రశంస పత్రాలు విద్యార్థులకు అందించారు ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి , బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని ప్రతి ఒక్కరు కూడా చెకుముకి రాయి లాగా తారాజువ్వలను వెదజల్లుతూ చీకటిని తొలగించుకుని అనగా అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపు అడుగులు వేయాలని అందుకు అక్షరమే సరైన ఆయుధమని అన్నారు అదేవిధంగా ప్రతి ఒక్కరూ చదువుకున్న పాఠశాలకు అతిధిగా వెళ్ళగలిగినప్పుడు జీవితంలో సక్సెస్ అయినట్లుగా భావించాలని పిల్లలను బాగా మోటివేషన్ చేశారు

మెమెంటో లను జె వీ వీ మాజీ మండల అధ్యక్షులు కీ.శే.కొల్లవజ్జుల చంద్రశేఖర్ జ్ఞాపకార్థం తండ్రి రాధాకృష్ణమూర్తి అందచేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ నివాళి అర్పించి,వారి సేవలను గుర్తు చేసుకున్నారు

ప్రభుత్వ విభాగంలో తెలుగు మీడియంలో ప్రథమ స్థానం లో కేజీబీవీ విద్యార్థులు ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం లో ప్రథమ స్థానంలో టీఎస్ ఎంఎస్ గుర్తుర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో జడ్.పి.హెచ్.ఎస్ మాటేడు విద్యార్థులు రెసిడెన్షియల్ విభాగంలో ప్రథమ స్థానంలో సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో ఎంజేపీ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం లో ప్రథమ స్థానంలో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో శ్రీనలంద హై స్కూల్ విద్యార్థులు బహుమతులు అందుకున్నారు

ఇందులో ప్రథమ స్థానంలో గెలుపొందినటువంటి టీమ్ లు ఈనెల 28న జిల్లా స్థాయిలో మహబూబాబాద్ లో జరిగే చెకుముకి పోటీలలో పాల్గొనాలని అన్నారు

ఈ సందర్భంగా విజేతలకు

డాక్టర్ యం ఈ ఓ మరియు హెచ్.యం.లక్మినారాయణ చేతుల మీదుగా

మెమోంటోమరియు ప్రశంస పత్రాలనువారితో పాటుగా పాల్గొన్న విద్యార్థులందరికీ కూడా ప్రశంస పత్రాలను అందజేశారు అనంతరం ముఖ్య అతిథులను జే వి వి పక్షాన శాసలువాలతో సత్కరించారు

ఉదయము స్థానిక మండల విద్యాశాఖ అధికారి బుచ్చయ్య చేతుల మీదుగా ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్చయ్య మాట్లాడుతూ సైన్స్ లేనిది ఈ సమాజం లేదని దేనిని గుడ్డిగా నమ్మరాదని ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచించి సమాధానం కనుక్కోవాలని ప్రతి విద్యార్థి ఈ దశ నుండే వివేచన విచక్షణను పెంపొందించుకోవాలని అన్నారు

ఈ కార్యక్రమంలో హరిపిరాల గెజెటెడ్ ప్రధానోపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు,తొర్రుర్ పాఠశాల ,ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బ్రహ్మానంద రెడ్డి కార్యక్రమ సమన్వయకర్త జె వి వి జిల్లా ఉపాధ్యక్షులురాయిపెల్లి యాకయ్యలి

జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కొండం వసుందర్ , మండల ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్ చెకుముకి కన్వీనర్ పులి ముత్తిలింగం శ్రీధర్ రెడ్డి,కోశాధికారి ఎద్దు వెంకన్న జెవివి బాధ్యులు జ్యోతి, రేణుకా దేవి, లింగమూర్తి బ్రహ్మానందరెడ్డి సుధకారాచారీ , ప్రేమలత, ఓంప్రకాష్, కిశోర్, మధు,లింగన్న,వెంకన్నతో పాటుగా వివిధ పాఠశాలల ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ట్రంప్ శాంతి ఒప్పందం- కావాలంటే స్నేహాన్ని వదులుకుంటాం: జెలెన్‌స్కీ

రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28 సూత్రాల శాంతి ప్రణాళికపై రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి. రష్యాకు కొంతవరకు అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్న ఈ ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఖండిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే అమెరికాతో ఉన్న స్నేహబంధాన్నే పక్కన పెట్టడానికి సిద్ధమని పరోక్షంగా హెచ్చరించారు.

ట్రంప్ అల్టిమేటం- కీవ్‌కు వారంరోజుల గడువు

యుద్ధం వెంటనే ఆగాలంటే తమ ప్రణాళికను కచ్చితంగా అంగీకరించాలని, ఇందుకోసం కీవ్‌కు కేవలం వారం రోజులు మాత్రమే సమయం ఉందని ట్రంప్ ముందుగానే స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను అమలు చేస్తే యుద్ధం ఆగుతుందని, లేదంటే ఉక్రెయిన్ పోరాడాల్సిందేనని కూడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ బహిరంగంగా స్పందించారు. దేశం చరిత్రలో అత్యంత క్లిష్ట పరిస్థితి నెలకొన్నదని, మన ఆత్మగౌరవాన్ని కోల్పోవడమా? లేక కీలక భాగస్వామిని వదులుకోవడమా? అన్నదాన్ని ఎంచుకునే సందర్భం వచ్చిందని వ్యాఖ్యానించారు. అయితే నిర్ణయాలు మాత్రం ఉక్రెయిన్ ప్రయోజనాల ఆధారంగానే ఉంటాయని, అవసరమైతే మిత్రదేశాలను కూడా వదిలివేయడానికి వెనకాడమని ఆయన వ్యాఖ్యలు స్పష్టంగా సూచించాయి.

వేరుప్రతిపాదనలు సిద్ధం చేస్తాం: జెలెన్‌స్కీ

ట్రంప్ ప్రతిపాదించిన 28 సూత్రాల బదులుగా ప్రత్యామ్నాయ సూచనలు ఇవ్వాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో జెలెన్‌స్కీ సమావేశమై పరిస్థితులను వివరించారు. ట్రంప్ యుద్ధం త్వరగా ముగించాలని కోరుకుంటున్న ఉద్దేశాన్ని గౌరవిస్తున్నామని, అయితే ఉక్రెయిన్ భద్రత, భూభాగ సమగ్రతపై ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. త్వరలోనే జెలెన్‌స్కీ%-%ట్రంప్‌ల భేటీ జరగనుందని, ఈ సమావేశంలో శాంతి ప్రణాళికపై మళ్లీ చర్చించే అవకాశం ఉందని అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.

ఉక్రెయిన్ ఇంకా భ్రమలోనే ఉంది: పుతిన్

ట్రంప్ ప్రణాళికపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా స్పందించారు. “ఈ ప్రణాళికను ఉక్రెయిన్ అంగీకరించకతప్పదు. కీవ్, దాని నాటో మిత్రదేశాలు ఇప్పటికీ భ్రమల్లోనే జీవిస్తున్నాయి. రష్యాను యుద్ధంలో ఓడించగలమని అవాస్తవ కలలు కంటున్నాయి” అని పుతిన్ ఎద్దేవా చేశారు. యుద్ధం ముగించేందుకు రష్యా సిద్ధంగా ఉందని, శాంతి ప్రణాళికపై వివరమైన చర్చలకు తాము అంగీకరిస్తున్నామని, అయితే అది సాధ్యంకాకపోతే యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించారు.

ట్రంప్ 28 సూత్రాల ప్రణాళికలో ఏముంది?

మూడేళ్లకు పైగా సాగుతున్న రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధానికి శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ట్రంప్ ఈ 28 సూత్రాలను రూపొందించారు. వీటిలో రష్యాకు అనుకూలంగా ఉన్న అంశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందులో భాగంగా దొనెట్స్క్ సహా పలు కీలక ప్రాంతాలను కీవ్ వదులుకోవాల్సి ఉంటుంది. ఉక్రెయిన్ తన సైనిక శక్తిని తగ్గించుకోవాలి. భద్రతా ఏర్పాట్లు, భూభాగ హామీలపై పెద్ద మార్పులు చేయాలి అయితే యుద్ధంతో దెబ్బతిన్న ఉక్రెయిన్ మౌలిక వసతుల పునర్నిర్మాణానికి భారీ సహాయం అందించే అంశాలను కూడా ఈ ప్యాకేజీలో చేర్చారు.ఇటీవల ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతిని సాధించడానికి వాషింగ్టన్ ఒక సాధ్యమైన మార్గాన్ని గుర్తించిందని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ దీనిని ఆమోదించినట్లయితే మాత్రమే ఈ ప్రతిపాదన ముందుకు సాగుతుందని చెప్పారు. “మనం శాంతిని సాధించడానికి ఒక మార్గం ఉందని మేం భావిస్తున్నాం. ఆయన దానిని ఆమోదించాలి. వారు సహేతుకంగా దగ్గరవుతున్నారని నేను అనుకుంటున్నాను, కానీ నేను అంచనా వేయాలనుకోవడం లేదు” అని ట్రంప్ అన్నారు.

# సింగభూపాలెం -అంజనాపురం రహదారి ప్రజలకు పొంచి ఉన్న ముప్పు

**పెద్ద కాలువ దగ్గర మోరీలు మరియు రహదారి విస్తీర్ణం మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదం**

**వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**

**సింగభూపాలెం మార్గం- ప్రమాద మలుపు ముందే పగిలిన మోరీలు- రహదారి రిస్క్ జోన్‌గా మారింది**

**ప్రమాద సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి॥ రోడ్‌కు తక్షణమే మెరుగులు అవసరం**

**సింగభూపాలెం-అంజనాపురం రూట్ లో సేఫ్టీ అలర్ట్!**

**మోరీలు దెబ్బతిని ప్రయాణం ప్రమాదకరం**

**రహదారి మీద నిశ్శబ్ద ముప్పు ప్రజలు ఆందోళనలో**

**కూలిపోయిన మోరీలు రోడ్డుపై ప్రమాదం పెరుగుతోంది**

**రిస్క్ పెరుగుతున్న నేపథ్యంలో రహదారి అధికారులు స్పందించాలి**





సుజాతనగర్ తొలి సమయం నవంబర్ 21 సుజాతనగర్ మండల కేంద్రం నుంచి సింగభూపాలెం - అంజనాపురం వెళ్లే ప్రధాన రహదారిలో మౌలిక వసతుల లోపం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ రహదారిపై ఉన్న పెద్ద కాలువపై ఏర్పాటు చేసిన మోరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షాలు పడ్డ సమయం లో సమయంలో రోడ్డు పక్కన విరిగిపడిన మోరీలు ఎప్పుడైనా ప్రమాదానికి దారితీయవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు విస్తీర్ణం చిన్నగా ఉండటం వల్ల తరచూ యాక్సిడెంట్స్ జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రహదారి విస్తీర్ణంపెంచాలని స్థానికులు కోరుతున్నారు.

మూల మలుపు వద్ద డేంజర్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

మలుపు వద్ద ఉన్న ఈ మోరీలు పగిలి ఉండటంతో చాలా గ్రామాల మధ్య రాకపోకలు ప్రమాదకరంగా మారాయని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. వాహనదారులు ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్త వహించక తప్పడం లేదు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.

ఈ సమస్యను పలుమార్లు పత్రిక రూపం లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పగిలిపోయిన మోరీలని రహదారి విస్తీర్ణం వెంటనే కొత్త మోరీలు ఏర్పాటు చేయాలని, రహదారి పక్కన ఉన్న పొదలు తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామ పంచాయతీ, రోడ్డు %-% భవనాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఒక్కడి వల్ల ఐబొమ్మ సాధ్యమైందా? - ఇమంది రవి వెనక ఇంకెంతమంది?

**కీలక విషయాలు రాబడుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు - యూకే, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ లింకులపై రెండో రోజూ ప్రశ్నలు - తమిళ వెబ్‌సైట్ల నుంచే అధిక సినిమాలు కొనుగోలు చేసినట్లు గుర్తింపు**




: దేశ విదేశాల్లో విలాసవంతమైన జీవితం, భారీగా స్థిరాస్తులు, 100కు పైగా వెబ్‌సైట్లు, 21 వేల పైరసీ సినిమాలు. ఇదంతా ఒక్కడి వల్ల సాధ్యమవుతుందా? తెర వెనక ఇంకెంత మంది సహకరిస్తున్నారు? ఐబొమ్మ నిర్వాహకుడు రవి నుంచి కీలక వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఇలా మారడానికి కారణాలపై పోలీసుల ఆరా : ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రెండో రోజు కస్టడీలో అతడి నుంచి కీలక సమాచారం రాబట్టినట్టు సమాచారం. యూకే, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ లింకులపై రెండోరోజూ పోలీసులు ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. తమిళ వెబ్‌సైట్స్ నుంచే అధిక శాతం సినిమాలను రవి కొనుగోలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. కరేబియన్ దీవుల్లోని కార్యాలయం సహా యూకేలోని సాంకేతిక నిపుణుల సాయంతో పైరసీ సినిమాల దందా యథేచ్ఛగా సాగించినట్లు అంచనాకు వచ్చారు. మరోవైపు ఇమంది రవి ఇలా మారడానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.ఇతడే చేశాడా? తెర వెనుక ఇంకెంతమంది ఉన్నారో? - ఐబొమ్మ రవి కేసులో కొనసాగుతున్న దర్యాప్తు (%ఐటీ కోర్సులు పూర్తి చేసిన అనుభవంతో : ఎన్నో ఏళ్ల క్రితమే ఇమంది రవి తల్లిదండ్రులు వేరుపడ్డారు. ఎన్నో తంటాలు పడి రవి బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఉద్యోగం కోసం ముంబయి వెళ్లి ఆర్థిక ఇబ్బందులు, అర్ధాకలితో అలమటించిన రోజులను చూశానంటూ పోలీసులతో రవి తన బాధను వెళ్లగక్కినట్టు సమాచారం. ఐటీ కోర్సులు పూర్తి చేసిన అనుభవంతో కంపెనీలు ప్రారంభించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నా, వైవాహిక జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొని విడిపోయినట్లు రవి పోలీసులకు వివరించారు. 8 ఏళ్ల కుమార్తె ఉన్నా నాలుగేళ్లుగా ఒంటరిగా బతుకీడ్చుతున్నాడు.డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో

పైరసీ : ప్రతి అడుగులో ఎదురైన చేదు అనుభవాలతో డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఈ పని చేశానంటూ పోలీసుల ప్రశ్నలకు సమాధానమిచ్చినట్టు సమాచారం. పైరసీదారుల నుంచి సినిమాలు కొనుగోలు చేసినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. సాఫ్ట్‌వేర్ సాయంతో వీడియోలను హెచ్‌డీ క్వాలిటీలోకి మార్చి, ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది. సర్వర్ల నుంచి హ్యాక్ చేసినట్టు పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభించలేదని సమాచారం.

అరకొర సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నం : అమీర్‌పేట్‌లో కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన రవి, ఆ పరిజ్ఞానంతో ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేయగలిగాడా? అనేది చిక్కుముడిగా మారింది. పోలీసుల ప్రశ్నలకు అరకొర సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నం చేసినట్టు సమాచారం. యూకేలో ఉన్న బృందాల ద్వారానే వెబ్‌సైట్ల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. దాదాపు 35 బ్యాంకు ఖాతాలను క్రిప్టో కరెన్సీ మార్పిడికి ఉపయోగించి, వీటి ద్వారానే ఏజెంట్లకు నగదు బదిలీ చేసినట్లు గుర్తించారు.

ఆనవాళ్లు పసిగట్టకుండా పేరు మార్చి : తన ఆనవాళ్లు పసిగట్టకుండా ప్రహ్లాద్ కుమార్ పేరుతో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతాలు, విదేశీ పౌరసత్వం తీసుకున్నట్టు అంగీకరించినట్టు తెలిసింది. బెట్టింగ్ యాప్స్ ప్రకటనలతో వచ్చిన సొమ్మును పైరసీ సినిమాలు కొనేందుకు వెచ్చించినట్టు వెల్లడించాడు. కరేబియన్ దీవుల్లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో 20 మంది ఉద్యోగులు పని చేస్తున్నట్టు రవి చెప్పినట్టు తెలిసింది.

సవాలుగా మారిన పైరసీ వెబ్‌సైట్లు : పైరసీ సినిమాల వేదికల్లో కేవలం ఐబొమ్మ, బప్పం మాత్రమే పోలీసులు తీసివేశారు. మిగిలిన పైరసీ వెబ్‌సైట్లను ఎలా తొలగించాలనేది పోలీసులకు సవాల్‌గా మారింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101